IN MEDIA PUBLICATION PVT LTD
MV NEWS
@vaartanews @mvnewstv
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
www.mivaartanews.com
TGBIL/25/A0512
హైదరాబాద్
బుధవారం 19 ఆగస్టు 2026
సంపుటి : 02
సంచిక :48
పేజీలు : 12 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

- ట్రంప్ పోస్ట్ నేపథ్యంలో ఈసీ కీలక ప్రకటన!
- దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు జారీ
- ఈసీ కీలక ప్రకటన- ఓటర్ ఐడీల ప్రాధాన్యతను వివరిస్తూ ట్రంప్ భారత్‌ను ఉదాహరణగా చూపడంతో వివరాల్ని వెల్లడించిన ఈసీ




## 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'

- ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతటి చర్యలకైనా సిద్ధమన్న కేంద్రం
- 26/11 ముంబయి దాడుల కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా
- నిందితులు లేకున్నా విచారణ ప్రారంభం
- ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే భారత లక్ష్యమని ఎంఈఏ స్పష్టం





## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

- ఇదే సరైన మార్గం: రాహుల్ గాంధీ
- విద్యార్థులు, ఝార్ఖండ్ ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదరడంపై రాహుల్ గాంధీ హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడి



## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

- మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణ
- ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారని ఆరోపణ
- సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ
- ఈసీని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చిందంటూ వ్యాఖ్య

హైదరాబాద్

తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని, పాత రికార్డులను - మిగతా3లో

# మళ్లీ వచ్చేది మనమే

- 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా
- కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం
- అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు
- బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించిన సీఎం
- సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం స్ఫూర్తి నింపేలా



హైదరాబాద్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల - మిగతా3లో



## విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

- విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాల్సిందేనన్న క్రాక్రోచ్ జనతా పార్టీ
- కోర్టు అడిగిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమే

# మధ్యవర్తులను ఆశ్రయించొద్దు



- 22ఏ భూములు విషయంలో కట్టు కథలు నమ్మొద్దు, దళారులను ఆశ్రయించొద్దు : సీఎం రేవంత్
- 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ప్రజల ఆస్తి పరిరక్షణకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వెల్లడి
- ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతాం

హైదరాబాద్

ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకొన్న వారి ఆస్తులు 22-ఏ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలించి, అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22-ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని తెలిపారు. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వమని స్పష్టం చేశారు. 22-ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. ఎలాంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దని కోరారు.

**తప్పును సరిదిద్దుతున్నాం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఇది పేదల ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ - మిగతా3లో

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

- పంజాబ్ బాధ్యతలు సతీశ్ పూనియాకు
- గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కీలక నియామకాలు



## రైతుల అవసరాలకు అనుగుణంగా

# ఉద్యాన పరిశోధనలు

- పరిశోధన ఫలితాలు రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతికతను వినియోగించాలి
- చిన్న, సన్నకారు రైతులే లక్ష్యంగా పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక కార్యాచరణ అవసరం
- మూడు నాలుగేళ్లలో తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ విస్తరణ లక్ష్యం
- శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి తుమ్మల




హైదరాబాద్

రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు జరగాలని, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల్లో జరుగుతున్న పరిశోధనల ఫలితాలు రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ కు మంత్రి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యాన రంగానికి కొత్త దిశను చూపే చారిత్రాత్మక ఘట్టంగా - మిగతా3లో

# ఏజెన్సీలో నేడు బంద్!

- పోలీస్ నియామకాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్
- సాధారణ నోటిఫికేషన్లతో స్థానిక యువతకు నష్టమంటూ ఆందోళన

కాసిపేట, ఆగస్టు 18 : (మన మీ వార్త మండల ప్రతినిధి)




ఏజెన్సీ ప్రాంతాల ఆదివాసీ నిరుద్యోగ యువతకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్ తో నేడు ఏజెన్సీ ప్రాంత బంద్ కు పిలుపునిచ్చారు.
ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ లో ఏజెన్సీ ప్రాంత ఖాళీల కు సంబంధించి 75 శాతం రిజర్వేషన్ ప్రస్తావన లేకపోవడం ఆదివాసీ యువతలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న అనేక మంది యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు దక్కడం అత్యంత కీలకం. అయితే, ఈ ఖాళీలను ప్రత్యేకంగా గుర్తించకుండా సాధారణ నియామక ప్రక్రియలో భర్తీ చేస్తే.. పోటీలో స్థానిక గిరిజన యువత వెనుకబడి నష్టపోయే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రత్యేక విధానం అవసరం**

ఏజెన్సీ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, విద్యా-ఉపాధి అవకాశాల పరిమితులను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఆదివాసీ యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఏజెన్సీ ప్రాంత ఖాళీలను ప్రత్యేకంగా గుర్తించి, స్థానికులకు ప్రయోజనం చేకూరేలా నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీస్ నియామకాలతో మొదలైన ఈ అంశం.. భవిష్యత్‌లో వెలువడే ఇతర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి**

పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ ను పునఃసమీక్షించి, ఏజెన్సీ ప్రాంత యువతకు న్యాయం జరిగేలా అవసరమైన మార్పులు చేయాలని కోరుతున్నారు. 75 శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
శాంతియుతంగా బంద్ కు సన్నాహాలు నేటి బంద్ ద్వారా తమ హక్కులను, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని ఆదివాసీ సంఘాలు, యువజన సంఘాలు, నిరుద్యోగులు సిద్ధమయ్యారు. ఈ బంద్ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజా జీవనం ఎలా ఉంటుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏజెన్సీ ఖాళీలను ప్రత్యేకంగా గుర్తించి, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాల్లో శాశ్వత న్యాయం చేకూర్చాలని ప్రజలు కోరుతున్నారు.

# 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'

ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు, ఉగ్రదాడుల వెనుక ఉన్న నిందితుల్ని చట్టం ముందు నిలబెట్టేందుకు భారతదేశం 'ఎంతటి చర్యలకైనా వెనుకాడదు' కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) స్పష్టం చేసింది. 2008 నాటి 26/11 ముంబయి ఉగ్రదాడి కేసులో పాకిస్థాన్‌లో దాక్కున్న ఆరుగురు ప్రధాన నిందితులపై ముంబై పోలీసులు 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా' ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలోనే ఎంఈఏ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా విచారణ జరిపే విధానాన్నే ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా అంటారు. దీనిపైనే మాట్లాడిన భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్- సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కునే విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోమని, ఎలాంటి చర్యలైనా తీసుకుంటామని జైస్వాల్ స్పష్టం చేశారు. ఉగ్రవాదం వల్ల భారత్ తీవ్రంగా నష్టపోయిందని, ఉగ్రవాద చర్యలు ఎంత తీవ్రమైనవో అంతర్జాతీయ సమాజం గుర్తించాలనే తాము కోరుతున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు బయట జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాల్ని ఏకం చేసేందుకు భారత్ నిరంతరం శ్రమిస్తోందని, ఈ పోరాటంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోదని జైస్వాల్ వెల్లడించారు.

**హాఫీజ్ సయీద్ సహా నిందితులు వీరే**

26/11 కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ముంబయి పోలీసులు ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు (గైర్హాజరీలో విచారణ) సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు. వీరిలో లష్కరే తోయిబా (రాజు) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్, సీనియర్ ఆపరేటివ్ జకీ-



ఉర్- రెహ్మాన్ లఖ్వీ, సాజిద్ మీర్, అబు అల్కామా, అసిమ్ అలియాస్ అబు కహాఫా, మేజర్ అబ్దుర్ రెహ్మాన్ పాషా ఉన్నారు. ఈ నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్న నేపథ్యంలో ముంబయి పోలీసులు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నిగమ్‌కు లేఖ రాసి తదుపరి ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఇలాంటి ఉగ్రవాద కేసులో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీచీచీూ), 2003లోని సెక్షన్ 356 కింద ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు సంబంధించిన నిబంధనల్ని తొలిసారి వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉజ్వల్ నిగమ్ ప్రకారం- పరారీలోని నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా వారిపై విచారణ కొనసాగించేందుకు సెక్షన్ 356 అవకాశం కల్పిస్తుంది. న్యాయ ప్రక్రియలో అనవసర జాప్యాన్ని నివారించడమే దీని ఉద్దేశమని ఆయన తెలిపారు. ఇక 2008 నవంబర్ 26న పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబయి నగరంపై భీకర దాడులు చేశారు. ఈ ఘటనలో 160 మందికిపైగా పౌరులు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ దాడులకు ప్రణాళిక రూపొందించడం, సహకరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో దాక్కున్న నిందితులపై చర్యలు తీసుకోవాలని భారత్ పదేపదే కోరుతూ వచ్చింది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు 14 రాష్ట్రాల్లో భారత భద్రతా దళాలు నిర్వహించిన విస్తృత ఆపరేషన్లలో పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న షాజాద్ భట్టి ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేశాయి. ఈ దాడుల్లో 253 మందిని అదుపులోకి తీసుకోగా, 80కిపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 200 కుపైగా ఆపరేటర్లను అరెస్ట్ చేసినట్లు భద్రతా సంస్థలు వెల్లడించాయి. ఇక ఈ కుట్రలతో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనల్ని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. షాజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు ఐఎస్ఐతో సంబంధం ఉందని భారత్ వాదిస్తుండగా పాకిస్థాన్ దీనిని తిరస్కరించింది. దీనిపై మాట్లాడిన జైస్వాల్, భారత ప్రభుత్వం ఇప్పటికే దీనిపై తమ వైఖరిని వెల్లడించిందని, దానికే కట్టుబడి ఉంటుందని తెలిపారు.

**జమ్మూలో రాజు కమాండర్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్**

ఇక పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఆపరేషనల్ కమాండర్ మహ్మద్ యాకూబ్‌పై జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న నిందితుడిపై ఈ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఈ యాకూబ్‌ను అబు సుమామా, సుమామా ఇల్యాస్, వారిస్ అలీ అనే పేర్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. యాకూబ్ ఇస్లామాబాద్‌లోని చట్టా బఖ్తావర్ ప్రాంతం నుంచి లష్కరే తోయిబా కార్యకలాపాల్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన కేసులో విషయంలో ఢిల్లీ ప్రభుత్వం జాప్యం చేయొద్దని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని తెలిపింది. కోర్టు ఆదేశాల మేరకు కొట్టివేయాల్సిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం వెంటనే సమర్పించాలని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.
కోర్టు ఎఫ్ఐఆర్‌ల వివరాలను కోరుతున్నప్పుడు ప్రభుత్వం వాటిని సమర్పించడంలో ఎందుకు వెనుకాడుతోందని దాస్ ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని మరింత ఆలస్యం చేసే ప్రయత్నాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమేనని అన్నారు. ప్రభుత్వం ఇతర నేర కేసులపై చర్యలు తీసుకోవాలనుకుంటే అది వేరే అంశమని పేర్కొన్నారు. సుమారు 2,800 మంది తీవ్ర నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించినట్లు ప్రభుత్వం చెబుతోందని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవడాన్ని విద్యార్థుల కేసులతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు భవిష్యత్తులోనూ చట్టపరమైన సమస్యలు ఎదుర్కోకుండా చూడాలని సీజేపీ కోరుతోంది. కేసులను కేవలం క్లోజ్ చేసినట్లు చూపడం కాకుండా, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను అధికారికంగా ఉపసంహరించుకోవాలని పార్టీ డిమాండ్ చేస్తోంది.

**దర్యాప్తు జరిపేందుకు హైపవర్డ్ కమిటీ**

మరోవైపు నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలపైన పిటిషన్?పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. నిరసనల సందర్భంగా వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది. నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలైన పిటిష పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.




**ఆరోపణలను ఖండించిన ఢిల్లీ పోలీసులు**

అయితే తమపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టులో ఢిల్లీ పోలీసులు ఖండించారు. జులై 20న సీజేపీ నిర్వహించిన మార్చ్‌లో నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టి, పార్లమెంటు వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడం వల్లే హింస చెలరేగిందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ ఈ వివరాలు వెల్లడించారు. సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో 30,000 మందికి పైగా నిరసనకారులు గుమికూడగా వారిని నియంత్రించేందుకు 5,000 మంది పోలీసులను మోహరించినట్లు డీసీపీ తెలిపారు. పరిస్థితి అదుపు తప్పడంతోనే పోలీసుల జోక్యం అనివార్యమైందని ఈ ఘర్షణల్లో ఇరువైపులా గాయాలయ్యాయని పేర్కొన్నారు. పోలీసుల చర్యలు చట్టబద్ధంగానే ఉన్నాయని ఎలాంటి అక్రమ లేదా అనవసర బలప్రయోగం జరగలేదని అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలో భాగంగా జులై 20న సీజేపీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, ఇతర ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు కొందరు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జ్ చేశారు. పోలీసుల చర్యలకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిరసనకారులపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని కొన్ని వర్గాలు ఆరోపించాయి. అయితే పోలీసు శాఖ తన చర్యలను సమర్థించుకుంది.

## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

ఝార్ఖండ్ ప్రభుత్వం, విద్యార్థుల మధ్య చర్చలు సఫలం కావడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చర్చల మార్గాన్ని ఎంచుకోవడం, విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకోవడం సరైన విధానమని ప్రశంసించారు. విద్యార్థులను వెనక్కి లాగడానికి బదులుగా వారిని ముందుకు నడిపించే వ్యవస్థను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తానని రాహుల్? గాంధీ హామీ ఇచ్చారు.
"ఝార్ఖండ్ విద్యార్థులు- రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. విద్యార్థులు తమ నిరాహార దీక్షను విరమించారు. ఈ వార్త వినడం సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఝార్ఖండ్ ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుని పరిష్కారాన్ని కనుగొన్నారు. విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకున్నారు. ఇదే సరైన మార్గం. విద్యార్థులు ప్రశ్నలు అడిగినప్పుడు వారికి సమాధానాలు లభించాలి. మేము దేశంలోని ప్రతి విద్యార్థికి అండగా ఉంటాము. ప్రతి విద్యార్థికి వారి కష్టానికి తగిన ప్రతిఫలం, న్యాయమైన పోటీలో పాల్గొనేలా ఈ వ్యవస్థను పూర్తిగా మారుస్తాం" అని రాహుల్ గాంధీ తెలిపారు.

**జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్ష రద్దు**

విద్యార్థుల డిమాండ్ల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. అలాగే టీడీపీఎల్ సంస్థ నిర్వహించిన పరీక్షలు, వెలువడిన ఫలితాలు, ఆ ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన చర్యలన్నింటినీ రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 2014 నుంచి రాష్ట్రంలో నిర్వహించిన వివిధ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రాంచీలోని సదర్ ఆసుపత్రిలో విద్యార్థి నేత దేవేంద్రనాథ్ మహతో నిరాహార దీక్ష విరమించారు. రాష్ట్ర మంత్రులు దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ సమక్షంలో ఆయన దీక్షను ముగించారు. రాష్ట్రంలో నియామక పరీక్షల నిర్వహణ, పారదర్శకత, అవకతవకలపై విద్యార్థులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో మహతో నిరాహార దీక్షకు దిగారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కీలక నిర్ణయాలు ప్రకటించడంతో ప్రభుత్వం-విద్యార్థుల మధ్య చర్చలు కొలిక్కి వచ్చాయి.

**జేపీఎస్‌సీ పరీక్షలపైనా విచారణ**

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. ఈ దర్యాప్తును రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఎస్ఐటీ, సీఐడీ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నాయని, విచారణలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయని సోరెన్ తెలిపారు. జేపీఎస్‌సీ ద్వారా నియమితులైన కొందరిని పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టు చేసినట్లు కూడా పేర్కొన్నారు. యువత ప్రధానంగా జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలపై స్పష్టత కోరుతోందని సోరెన్ తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వం తరఫున ఓ మంత్రి దర్యాప్తు జరుగుతోందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం చెప్పిందే సరైనదిగా అనిపిస్తుందని, మరికొన్ని సందర్భాల్లో విద్యార్థుల వాదనలో నిజం కనిపిస్తుందని అన్నారు. రెండు వైపుల వాదనల్లో వాస్తవాన్ని తేల్చేందుకు సమగ్ర విచారణ అవసరమని సీఎం పేర్కొన్నారు.

**పరీక్ష రద్దుతో కొత్తగా మరో ఆందోళన**

ఒకవైపు విద్యార్థుల ఆందోళనకు పరిష్కారం లభించినప్పటికీ, మరోవైపు జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ ద్వారా ఇప్పటికే నియమితులైన ఉద్యోగులు కొత్త సమస్యను ఎదుర్కొంటున్నారు. పరీక్ష రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు ఉద్యోగులు రాంచీలోని ప్రాజెక్ట్ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని, తాత్కాలిక టార్పాలిన్ కింద నిలబడి నిరసన తెలిపారు. పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, అధికారికంగా నియామక ఉత్తర్వులు పొందిన తర్వాత మొత్తం ప్రక్రియను రద్దు చేయడం తమను అన్యాయంగా శిక్షించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగ హోదాపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, పరీక్ష రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచి వ్యూహాలను పదును పెడుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మంగళవారం ఆయా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లు, కో-ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను నియమించారు. కో-ఇన్‌ఛార్జ్‌గా జాతీయ కార్యదర్శి జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కు బాధ్యతలు అప్పగించారు. దేశ రాజకీయాల్లో కీలక రాష్ట్రంగా ఉన్న యూపీలో 2027 అసెంబ్లీ ఎన్నికల నేథ్యంలో సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల వ్యూహంపై తావ్డే బృందం దృష్టి పెట్టనుంది. ఇక పంజాబ్ రాష్ట్ర భాజపా ఇన్‌చార్జ్‌గా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సతీశ్ పూనియాను నియమించారు. అలాగే గుజరాత్ బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌కు అప్పగించారు. ఇతర రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌ల నియామకాలను త్వరలో చేపడతామని బీజేపీ తెలిపింది. అప్పటివరకు ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభారీ వ్యవస్థ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.

**కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం**

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను సోమవారం ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని రూపొందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మాజీ అమేఠీ ఎంపీ స్మృతి ఇరానీ, మాజీ త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజె, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం.

**విస్తృత ప్రాతినిధ్యంతో జాతీయ కార్యదర్శులు**

జాతీయ కార్యదర్శుల నియామకాల్లోనూ దేశవ్యాప్తంగా భౌగోళిక ప్రాతినిధ్యానికి బీజేపీ ప్రాధాన్యం ఇచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కవితా పటిదార్, కేరళకు చెందిన కె. సురేంద్రన్, యూపీకి చెందిన డాక్టర్ భోలా సింగ్, ఝార్ఖండ్‌కు చెందిన ప్రదీప్ వర్మ, గుజరాత్‌కు చెందిన జగదీశ్ పటేల్, ఢిల్లీకి చెందిన సందీప్ పాఠక్ తదితరులకు జాతీయ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించారు. నాగాలాండ్‌కు చెందిన ఫాంగ్నోన్ కొన్యాక్, కేరళకు చెందిన అనిల్ ఆంటోనీ, తమిళనాడుకు చెందిన ఎం. వెంకటేశన్, పశ్చిమ్ బెంగాల్‌కు చెందిన మనోజ్ తిగ్గా, బిహార్‌కు చెందిన సిద్ధార్థ్ శంభు, ఢిల్లీకి చెందిన స్వదేశ్ సింగ్, అసోంకు చెందిన మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్‌కు చెందిన రోహన్ గుప్తా, ఢిల్లీకి చెందిన జై ప్రకాశ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

**కీలక విభాగాలకూ కొత్త బాధ్యతలు**

కేంద్ర ఆర్థిక వ్యవహారాల్లో కీలకమైన జాతీయ కోశాధికారి బాధ్యతలను పీయూశ్ గోయల్‌కు మరోసారి అప్పగించారు. తరుణ్ చుగ్‌ను బీజేపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్‌కు చెందిన ఎంపీ హేమాంగ్ జోషికి యువ మోర్చా బాధ్యతలు ఇచ్చారు. మహిళా మోర్చా అధ్యక్ష బాధ్యతలను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌధరి చేపట్టనున్నారు. పార్టీ మీడియా విభాగంలో మాత్రం కొనసాగింపునకు ప్రాధాన్యం ఇచ్చారు. లోక్‌సభ సభ్యుడు అనిల్ బలూనీ మీడియా కన్వీనర్‌గా కొనసాగనున్నారు. ఆయనకు సహ కన్వీనర్లుగా ఆశిష్ ఉషా అగర్వాల్, ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ వ్యవహరించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్ మ్హాస్కేకు సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.

## రైతుల అవసరాలకు అనుగుణంగా
# ఉద్యాన పరిశోధనలు

-మొదటిపేజీ తరువాయి

ఈ పరిశోధనా సముదాయం నిలుస్తుందని అన్నారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, ప్రయోగశాలల్లో ఎన్నో విలువైన పరిశోధనలు జరిగినప్పటికీ వాటి ఫలితాలు రైతులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదని మంత్రి అన్నారు. గతంలో పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేయడానికి రేడియో, టెలివిజన్ వంటి పరిమిత మార్గాలు ఉండేవని, ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి శక్తివంతమైన మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పరిశోధనల ఫలితాలను వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌లు, సోషల్ మీడియా ద్వారా రైతులకు చేరేలా శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యాన శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ భూమిలో ఉద్యాన పంటలు సుమారు 6 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, వ్యవసాయ స్థూల విలువలో వాటి వాటా 26 శాతం, సుమారు రూ.30,346 కోట్లుగా ఉందని తెలిపారు. ఉద్యాన రంగం రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నందున పరిశోధన, సాంకేతికత, విస్తరణ సేవలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తిలో సుమారు 70 శాతం లోటు ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండటం ఆందోళనకరమని మంత్రి అన్నారు. రాష్ట్రంలోనే డిమాండ్ ఉన్న కూరగాయలు, ఉద్యాన పంటలను పండించేలా ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో డెమాన్‌స్ట్రేషన్ ప్లాట్లను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు ప్రత్యక్షంగా పంటలను, దిగుబడులను, ఆదాయ అవకాశాలను చూసి నేర్చుకునేలా ఫీల్డ్ డెమాన్‌స్ట్రేషన్లు నిర్వహిస్తే ఉద్యాన పంటల విస్తీర్ణం, ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతుల్లో దాదాపు 90 శాతం మంది చిన్న రైతులేనని, రెండు మూడు ఎకరాల భూమి కలిగిన రైతులు ఖరీదైన యంత్రాలు లేదా భారీ పెట్టుబడులతో కూడిన సాంకేతికతను స్వయంగా స్వీకరించలేరని అన్నారు. అందువల్ల తక్కువ ఖర్చుతో, చిన్న కమతాల్లో అమలు చేయగల సాంకేతికత, యంత్రాలు, సాగు పద్ధతులపై పరిశోధనలు జరగాలని సూచించారు. రైతుల జీవితాల్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపేలా గ్రామీణ యువతలో ఉన్న సృజనాత్మకతను కూడా ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన యువత తమ తల్లిదండ్రుల కష్టాలను తగ్గించేందుకు స్వయంగా యంత్రాలు, పరికరాలను రూపొందిస్తున్నారని, ఇలాంటి ఆవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. రానున్న మూడు నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, జాపత్రి తదితర అంతర పంటల ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు



కల్పించవచ్చని అన్నారు. రైతులు ప్రత్యక్షంగా చూసి నేర్చుకునేలా ఈ పద్ధతులను పరిశోధనా కేంద్రాలు, డెమాన్‌స్ట్రేషన్ ఫారాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఉద్యాన పరిశోధనలను కేవలం ప్రయోగశాలలకే పరిమితం చేయకుండా రైతుల పొలాల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అన్నారు. కూరగాయలు, పూలు, ద్రాక్ష, ఔషధ, సుగంధ పంటలపై పరిశోధనలను ఒకే గొడుగు కింద సమన్వయం చేసేందుకు హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం కీలకమైన ముందడుగు అని తెలిపారు. ఉద్యాన పంటల్లో ఉత్పత్తి పెంచడంతో పాటు పంట అనంతర నష్టాలను తగ్గించడంపైనా పరిశోధనలు అవసరమని మంత్రి చెప్పారు. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడం లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా పంట అనంతర నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా శాస్త్రీయ సూచనల మేరకు సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించేలా పరిశోధనా సంస్థలు, వ్యవసాయ శాఖ అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. పంటల్లో రసాయన అవశేషాలను తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులను అందించగలిగితే దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా తెలంగాణ పంటలకు మరింత డిమాండ్ ఏర్పడుతుందని అన్నారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ఆధునిక సాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు విధానాలు భవిష్యత్ వ్యవసాయానికి ఎంతో అవసరమని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే పద్ధతులను పరిశోధించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాల్లో కూడా తమ కార్యకలాపాలను విస్తరించాలని మంత్రి కోరారు. ప్రభుత్వానికి చెందిన సీడ్ ఫారాలు, ఇతర అందుబాటులో ఉన్న భూములను వినియోగించుకొని జిల్లాల వారీగా పరిశోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రైతులు తమ ప్రాంతంలోనే కొత్త పంటలు, ఆధునిక సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూసి స్వీకరించే అవకాశం కల్పించాలని అన్నారు.

వ్యవసాయమే భవిష్యత్తు అని మంత్రి పేర్కొన్నారు. కరోనా సమయంలో అన్ని రంగాలు దాదాపు నిలిచిపోయినా రైతు వ్యవసాయాన్ని మాత్రం ఆపలేదని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు వ్యవసాయాన్ని మరింత ఆకర్షణీయమైన, లాభదాయకమైన వృత్తిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ తదితర అనుబంధ రంగాలన్నీ రైతు కేంద్రంగా పనిచేయాలని, రైతు కష్టాన్ని ఎలా తగ్గించాలి, ఆదాయాన్ని ఎలా పెంచాలి అనే దృక్పథంతో పరిశోధనలు, విధానాలు రూపొందించాలని పిలుపునిచ్చారు.

రైతులకు నాణ్యమైన విత్తనాల సమస్యను పరిష్కరించేందుకు విత్తన ప్రాసెసింగ్ యూనిట్, మహిళా రైతులు, గ్రామీణ యువతకు శిక్షణతో పాటు కొత్త వ్యాపార అవకాశాలను కల్పించేందుకు మష్రూమ్ ఉత్పత్తి యూనిట్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రతి మూడు సంవత్సరాలకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని పరిశోధనా ఫలితాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే విధంగా యూనివర్సిటీ, పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయ?ఉద్యాన శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు.

# సంక్షేమ పథకాలపై క్రెడిట్ వార్

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ప్రచార ఆధిపత్యం సరికొత్త మలుపు తిరిగింది. సంక్షేమ పథకాల క్రెడిట్ ఎవరిదనే అంశంపై అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ మధ్య మొదలైన వాగ్వాదం ఇప్పుడు 'ఫోటోల వార్'గా మారింది. సంక్షేమ పథకాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ముద్రించాలని బీజేపీ పట్టుబడుతుండగా, కేంద్ర పథకాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఎందుకు పెట్టకూడదని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగిందితెలంగాణలో కొత్తగా జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను పక్కనపెట్టి సీఎం, మంత్రుల ఫోటోలు ఎలా ముద్రిస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.తెలంగాణలో 57 లక్షల రేషన్ కార్డుల ద్వారా దాదాపు 2 కోట్ల మంది ప్రజలకు కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం అందిస్తోందని, అలాంటప్పుడు ఆ పథకానికి సంబంధించిన కార్డులపై మోదీ చిత్రం ఎందుకు ఉండకూడదని నిలదీశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అదనంగా బుల్లెట్ రైన్ కారిడార్ కోసం మరో రూ.1.5 లక్షల కోట్లు వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నిధులిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాటకాలాడుతూ క్రెడిట్ కొట్టేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను విస్మరిస్తూ '22ఏ నిషేధిత భూముల జాబితా' పేరిట గత రెండేళ్లుగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.బండి సంజయ్ వ్యాఖ్యలకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా ఆదాయం వెళ్తోందని స్పష్టం చేశారు. జీఎస్టీతో పాటు ఇతర మార్గాల ద్వారా రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి భారీ మొత్తంలో పన్నుల రాబడి అందుతోందని, అందువల్ల



రాష్ట్రంలో అమలయ్యే కేంద్ర పథకాలన్నింటిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులు ఎంత? తిరిగి కేంద్రం నుంచి రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధులు ఎంత? అనే అంశంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో బలంగా ఉందని, తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం ఎవరిదో బండి సంజయ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీకి నిలబడే సత్తా బీజేపీకి ఉందా అని ప్రశ్నించారు.తెలంగాణలో మొదలైన ఈ వివాదం కేవలం ఒక ఫోటోకు సంబంధించినది మాత్రమే కాదు.. సంక్షేమ పథకాల అమలులో ఓటర్లను ఆకట్టుకునేందుకు జరుగుతున్న రాజకీయ పోరాటం. ఉచిత బియ్యం కేటాయింపులు తమవేనని కేంద్రం చెబుతుంటే, రాష్ట్రానికి రావాల్సిన న్యాయబద్ధమైన నిధులను ప్రస్తావిస్తూ ఫెడరల్ హక్కుల కార్డును కాంగ్రెస్ ముందుకు తెస్తోంది. కార్డులపై, పోస్టర్లపై ఫోటోల ప్రాధాన్యత ఎవరు దక్కించుకుంటారనే అంశం రాబోయే రోజుల్లో ఇరు పార్టీల మధ్య మరింత రాజకీయ వేడిని పెంచే అవకాశం ఉంది.

## డిజిటల్ ఓ వైపు... ఫీల్డ్ లో మరో వైపు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ యుద్ధం ప్రస్తుతం రెండు పారలర్ ఫీల్డ్స్‌లో జరుగుతోంది. ఒకవైపు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను, సోషల్ మీడియా సామ్రాజ్యాన్ని బీఆర్ఎస్ ముట్టడిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయి మాస్ రాజకీయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తన గుప్పిట్లో ఉంచుకుంటోంది. ఈ రెండు ఫీల్డుల్లో తమకు బలం ఉన్న ఫీల్డుల్లోనే రెండు పార్టీలు పోరాటాలు చేస్తున్నాయి కానీ మరో ఫీల్డులోకి వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు.కేటీఆర్ నిర్వహించే విలేకరుల సమావేశాలు మినహా బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ఆందోళనలకు దూరంగా ఉంటున్నప్పటికీ, సోషల్ మీడియా వేదికగా విపరీతమైన కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తోంది. యూట్యూబ్ ఛానళ్లు, ట్విట్టర్ , ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్ , ఇన్ఫ్లుయెన్సర్ల నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ నెట్‌వర్క్‌ను సద్వినియోగం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం వ్యతిరేకతను ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ శ్రేణులు ముందంజలో ఉన్నాయి.దీనికి పూర్తి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం సాగుతోంది. డిజిటల్ స్పేస్ కంటే ప్రజల మధ్య ప్రత్యక్షంగా ఉండే సభలకే ఆయన ప్రాధాన్యతనిస్తున్నారు. వారంలో రెండు మూడు బహిరంగ సభలు లేదా ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ నేరుగా ప్రజా బాహుళ్యంలోకి వెళ్తున్నారు. రేవంత్ ప్రసంగాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్ డైలాగ్‌లు, వైరల్ స్టేట్‌మెంట్లతో బీఆర్ఎస్‌ను ఎండగట్టేలా ఉంటున్నాయి.

## మళ్లీ వచ్చేది మనమే

-మొదటిపేజీ తరువాయి

సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం నిత్యం స్ఫూర్తి నింపేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలన్నారు. 2029లో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమావ్యక్తం చేశారు. నేత, గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ పొలాలు ఎక్కడున్నా ఈత, తాటిచెట్లు పెంచాలని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని పెంచితే కల్తీ లేని కల్లు వస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్ల వెంబడి నాటాలన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం

కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్?రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. "ప్రజాపాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ఉన్నాయి. సర్వాయి పాపన్న విగ్రహం పెట్టాలని గీత కార్మికులు కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు స్థలాన్ని నేనే సూచించాను. ఇక్కడ టూరిజం కార్యాలయం ఉండేది. విగ్రహం కోసం ఖాళీ చేయించా. ట్యాంక్‌బండ్‌కు ఎవరొచ్చినా, సర్వాయి పాపన్న విగ్రహం కనపడేలా స్థలం ఎంపిక చేశాను. దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు కనపడేలా విగ్రహం ఏర్పాటు చేశాం. బహుజనుల నుంచే పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్'

### మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్‌నే

గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

-మొదటిపేజీ తరువాయి



ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయదని . పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదని వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రిమాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు స్పష్టం చేస్తూ సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 మొత్తం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయని మంత్రి గారు వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందని తెలిపారు.

బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరపాటును పారదర్శకంగా అంగీకరించి . అదే సమయంలో జరిగిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నామని ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం తమది కాదని స్పష్టం చేశారు. వివిధ జీవోలు, మెమోల ద్వారా గత ప్రభుత్వాల కాలంలో క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు మరియు జీహెచ్ఎంసీ/హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చాయని మంత్రి వివరించారు.ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే గుర్తించిందని, బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని తెలిపారు.

22ఏ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి . జెన్యూన్ ప్రైవేట్ ఆస్తులన్నింటినీ తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు పేదవాడి సమస్యను రాజకీయంగా వాడుకోవడం మానేయండి. ఇది పేదల ప్రభుత్వం.. పేదల ఆశీస్సులతో వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వం. మేం తప్పును ఒప్పుకుని దిద్దుతున్నాం.. మీరు చేసిన తప్పులను ఒప్పుకునే ధైర్యం మీకుందా?" అని ప్రశ్నించారు. అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పొరపాటును అంగీకరించామన్నారు

## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది



-మొదటిపేజీ తరువాయి

సాకుగా చూపుతూ పౌరుల ఓటు హక్కును నిరాకరించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలాంటి పక్కా కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# సంపాదకీయం

## ఐదేళ్లలో దశాబ్దాల అభివృద్ధి


దేశ ప్రధాని నరేంద్ర మోడీ జాతిని ప్రధానంగా సప్త ధార గురించి ప్రస్తావించారు. గతాని కంటే భిన్నంగా ఈసారి మోడీ తక్కువ సమయం మాట్లాడినప్పటికీ.. అసలైన విషయాల గురించి ప్రస్తావించారు. గతంలో కరోనా సమయంలో దేశ ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. అంతకుముందు మేకింగ్ ఇండియా కార్యక్రమాన్ని అమలులోకు తీసుకొచ్చారుగతంలో కరోనా సమయంలో దేశ ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. అంతకుముందు మేకింగ్ ఇండియా కార్యక్రమాన్ని అమలులోకు తీసుకొచ్చారు. ఇప్పుడు ఏకంగా సప్త ధారను ప్రకటించారు. దీని ప్రకారం భారత దేశంలో తయారీ పరిశ్రమ వేగవంతం కానుందిని నరేంద్ర మోడీ ప్రకటించారు. తయారీ రంగం.. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ రంగం.. ఏఐ డీప్ టెక్.. డిఫెన్స్.. కనెక్టివిటీ.. గ్రీన్ బ్లూ ఎకానమీ విస్తరణ.. సాఫ్ట్ పవర్ సెక్టార్ల మీద ప్రధానంగా దృష్టి సారించబోతున్నట్లు ప్రకటించారు. గ్లోబల్ కాంపిటీషన్ తట్టుకునే విధంగా భారతదేశానికి ఈ పాలసీ అత్యంత కీలకమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.చైనా తయారీ రంగంలో.. అమెరికా ఏఐ డీప్ టెక్ లో.. ఇజ్రాయిల్ డిఫెన్స్ లో.. రష్యా కనెక్టివిటీలో.. యూరప్ దేశాలు గ్రీన్ బ్లూ ఎకానమిలో అద్భుతాలు సాధిస్తున్నాయి. అయితే ఈ రంగాలు మొత్తం భారతదేశంలో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యధిక జనాభా భారత దేశంలో ఉంది. పైగా యువశక్తి కూడా ఈ దేశానికి ప్రధాన బలం. అందువల్లే ఈ స్థాయిలో భారత్ ఈ రంగాల మీద దృష్టి పెట్టింది.సప్త ధారలో భాగంగా దశాబ్దాలుగా సాధించాలని అభివృద్ధిని దీని ద్వారా కేవలం ఐదు నుంచి ఏడు సంవత్సరాల లోనే చేసి చూపించవచ్చని నరేంద్ర మోడీ చెబుతున్నారు. ప్రకృతి, తీర ప్రాంతాల వనరుల మీద పెట్టుబడులు పెట్టడం ద్వారా గ్రీన్ బ్లూ ఎకానమీ ని డెవలప్ చేయడానికి ఆస్కారం ఉంటుంది. సాఫ్ట్ పవర్ లో భాగంగా.. భారతదేశ సంస్కృతిని.. సంప్రదాయాలను.. యోగ.. ఆయుర్వేదం.. యునాని వంటి వైద్య విధాలను విస్తరించి.. భారత బ్రాండ్ మొత్తాన్ని ప్రపంచానికి చాటి చెప్పవచ్చు. తయారీ రంగం.. వ్యవసాయం.. టెక్నాలజీ.. రోడ్ల అనుసంధానం.. డిఫెన్స్ వంటి రంగాలలో భారీగా ఉపాధి అవకాశాలు.. పెట్టుబడులు పెట్టడం ద్వారా.. ఎక్కువ అభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే ఈ రంగాలలో భారతదేశంలో విపరీతమైన అవకాశాలు ఉన్నాయి. పైగా వీటి ఎగుమతులను ఇతర దేశాలకు పంపించడానికి ఆస్కారం ఉంది. అందువల్లే సప్త ధారలో నరేంద్ర మోడీ ఈ రంగాలను పదే పదే ప్రస్తావించారు. భవిష్యత్తు కాలంలో వీటి ఆధారంగానే ప్రపంచ మనుగడ సాగుతుంది. అందువల్లే వీటి మీద నరేంద్ర మోడీ దృష్టిపెట్టి.. తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.ప్రపంచం మొత్తం ప్రస్తుతం టెక్నాలజీలో దూసుకుపోతోంది. టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెట్టిన దేశాలు పండగ చేసుకుంటున్నయి. టెక్నాలజీ ముందుకు నడవాలంటే ఖచ్చితంగా సెమీ కండక్టర్లు ఇప్పుడు చాలా అవసరం. సెమీ కండక్టర్లకు సంబంధించి ప్రపంచ అవసరాలను తైవాన్ తీరుస్తోంది. దక్షిణ కొరియాకు కూడా ఇందులో భాగముంది. అయితే ఇప్పుడు సెమీ కండక్టర్ల తయారీలో భారత్ కూడా ప్రగతిని సాధిస్తుంది. వచ్చే రోజుల్లో సొంతంగా వీటిని తయారు చేసుకోవాలని నిర్ణయించుకుంది. అందువల్ల నరేంద్ర మోడీ తన సప్త ధార కార్యక్రమంలో టెక్నాలజీకి పెద్దపీట వేశారు. ఇక సముద్ర తీర ప్రాంతాలలో పర్యటకానికి ఎక్కువగా ఆస్కారం ఉంటుంది.మాల్దీవులు వంటి దేశం ఆర్థికంగా ఒకప్పుడు బలంగా ఉందంటే దానికి ప్రధాన కారణం తీర ప్రాంత పర్యాటకమే. మనదేశంలో తీర ప్రాంత రాష్ట్రాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వాటిలో ఇప్పటికీ అనుకున్న స్థాయిలో టూరిజం అభివృద్ధి కాలేదు. ఆ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టి.. టూరిజం డెవలప్ చేస్తే అవకాశాలు పెరుగుతాయి. విదేశీ మారకద్రవ్యం కూడా అధికంగా వస్తుంది. ఈసారి ప్రసంగంలో పాకిస్తాన్ పేరును ప్రధాని మోదీ ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. ఇక చైనా ప్రస్తావన కూడా తీసుకురాలేదు. మన సరిహద్దు ఉగ్రవాదం, సీమాంతర ఉగ్రవాదం గురించి మాట్లాడలేదు. కశ్మీర్ అంశం లేకుండా జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం 1998 తర్వాత ఇదే అని చెప్పుకోవచ్చు. ఇది యాదృచ్ఛికం కాదు. పొరుగు దేశాలు తమ పరిధిలోనే ఉన్నాయని, దుస్సాహసానికి అవకాశం లేదని పరోక్షంగా ప్రపంచానికి తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్‌పై ప్రభావం, చైనా వైపు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరిహద్దు ఉగ్రవాదం గణనీయంగా తగ్గిందని, కశ్మీర్ ప్రశాంతంగా ఉందని మోదీ పరోక్షంగా కశ్మీర్, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రస్తావిచలేదు.ఇక మోదీ ప్రసంగానికి విరుద్ధంగా ఉంది పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రసంగం. పాకిస్తాన్ వైపు నుంచి రా, పీవోకే అల్లర్లు, బలూచిస్తాన్ దాడులు, సింధూ జలాలపై నిందలు భారత్‌పై వేస్తున్నారు. భారత నామస్మరణ లేకుండా పాకిస్తాన్ నేతలు మాట్లాడడం లేదు. భారత్ మాత్రం ఆ దేశం పేరు కూడా ఎత్తకుండా ఉండటం మన నమ్మకానికి నిదర్శనం. ఎదురుపక్షం ఎంత మాట్లాడినా, భారత్ ఆ విషయాలను పట్టించుకోవడం లేదనే సందేశం అగ్నివీర్‌లను ఈ ప్రక్రియలో ఉపయోగించుకునే అవకాశం ఉందని అనుకోవచ్చు. సైన్యంలో శిక్షణ, క్రమశిక్షణ పొంది గ్రామాలకు తిరిగి వచ్చిన వారు సివిల్ డిఫెన్స్‌లో కీలక పాత్ర పోషించగలరు. ఇజ్రాయెల్ తరహాలో సివిలియన్ స్థాయిలో భద్రతా సామర్థ్యం పెంచుకునే దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పవచ్చు.రాబోయే ఐదు నుంచి ఏడు ఏళ్లలో గత 50 ఏళ్లలో చేయనంత అభివృద్ధి సాధించాలని ప్రధాని పిలుపునిచ్చారు. సైన్యం, ఆయుధాల తయారీపై కూడా ప్రస్తావన ఉంది. అయితే బాహ్య ముప్పుల కంటే అంతర్గత భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇది పరిస్థితులు మారాయని, భారత్ తన శక్తిని అంతర్గతంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసుకోవాలని సూచించే వ్యూహాత్మక మార్పు. పొరుగు దేశాలను పట్టించుకోకుండా ఉండటం అంటే వాటిని పూర్తిగా విస్మరించడం కాదు. వాటి ప్రభావం తగ్గిందని, ఇప్పుడు దృష్టి లోపలికి మళ్లించాలని చెప్పే తీరు. అదే సమయంలో కొత్త రకం ముప్పులకు సిద్ధం కావాలని హెచ్చరిక కూడా.మొత్తంగా చూస్తే, 2026 ఎర్రకోట ప్రసంగం కేవలం వేడుక కాదు. భారత్ ఎదుర్కొంటున్న కొత్త వాస్తవాల్లను, ప్రాధాన్యాలను ప్రతిబింబించే వ్యూహాత్మక ప్రకటన. మౌనం కూడా ఒక రకమైన భాషే. ఈసారి ఆ భాషే ఎక్కువగా మాట్లాడింది. టెక్నాలజీ.. వ్యవసాయం.. రోడ్ల అనుసంధానం వంటి వాటిల్లో భారీగా పెట్టుబడులు గనుక పెరిగితే అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. వాటి ద్వారా ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే భారీగా విదేశీ మారకద్రవ్యం వస్తుంది. తద్వారా దేశం ఆర్థికంగా బలోపేతం కావడానికి ఆస్కారం ఏర్పడుతుంది.ప్రధాని మోదీ చెప్పినట్లు, ఇప్పటి వరకు దశాబ్దాలు పట్టిన అభివృద్ధిని ఈ సప్తధార వ్యూహం ద్వారా 5 నుంచి 7 సంవత్సరాల్లోనే సాధించవచ్చని అంచనా. ఎందుకంటే ఈ ఏడు రంగాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. ఏఐ, డీప్‌టెక్ తయారీ, వ్యవసాయం, డిఫెన్స్‌లో సామర్థ్యం పెంచుతుంది. కనెక్టివిటీ గ్రీన్, బ్లూ ఎకానమీ, ఫుడ్ ప్రాసెసింగ్‌కు మార్కెట్లను తెరుస్తుంది. సాఫ్ట్ పవర్ భారత ఉత్పత్తులు, సేవలకు ప్రపంచ ఆమోదం పెంచుతుంది. ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఒక రంగంపై ఆధారపడితే సరిపోదు. బహుముఖ వ్యూహం అవసరం. సప్తధార ఈ అవసరాన్ని తీర్చేలా రూపొందింది కేంద్రం. ముఖ్యంగా పర్యావరణ సుస్థిరతను ఆర్థిక వృద్ధితో కలపడం ఆధునిక వ్యూహంలో భాగం.

# ఉమ్మడి సర్వీసు నిబంధనలే మేలు




రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, బోధన తీరు, మౌలిక వసతులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టనున్నది. విద్యాశాఖ ఏర్పాటు చేసిన అకడమిక్ ప్యానెల్ బృందాలు తరగతి గదుల్లో బోధన విధానం, పాఠ్య ప్రణాళిక, సిలబస్ పూర్తయిన తీరు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు వంటి అంశాలను పరిశీలిస్తారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం సామర్థ్యాలను కూడా అంచనా వేయనున్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన విద్యాపరమైన సహకారం అందించడం, పాఠశాలల్లోని గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం నాణ్యత, విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపైనా బృందాలు దృష్టి సారించనున్నాయి. సర్కార్ బడుల్లో చదువు, బోధన, వసతుల అసలు పరిస్థితిని పర్యవేక్షించే పాఠశాల తనిఖీలు చాలా కాలంగా పడకేశాయి. ప్రధానంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ న్యాయవివాదాల నేపథ్యంలో ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో ఖాళీల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. విద్యాశాఖలో పనిచేస్తున్న డీఈవోలంతా ఇన్‌చార్జులే! వీరికి తరగతిలో ప్రత్యక్ష అనుభవం లేదు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఈవో ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు నిర్వహించడంతో కీలకమైన తరగతి బోధన పరిశీలన నామమాత్రమైంది. అంతేకాదు, విద్యావ్యవస్థలో బోధన కంటే బోధనేతర బాధ్యతలు ఎక్కువయ్యాయి. ఎంఈవోలపై ఒత్తిడి పెరిగింది. పర్యవేక్షణ గాడి తప్పింది. కొత్త నియామకాలు చేపట్టకుండా, పాఠాలు చెప్పే రెగ్యులర్ ఉపాధ్యాయులకే అదనపు బాధ్యతలు కట్టబెట్టడం వలన ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించాలనే ప్రతిపాదన చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రానికి కొత్తగా 33 జిల్లాలతో కూడిన రాష్ట్రపతి ఉత్తర్వులు 2018లో అమల్లోకి వచ్చాయి. ఈ ఉత్తర్వుల్లోని పేరా 3(3)లో పంచాయతీరాజ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఏకీకృతం గురించిన సవరణపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఈ నేపథ్యంలో 2021లో పంచాయతీరాజ్ శాఖలోని వివిధ పోస్టులను లోకల్ క్యాడర్లుగా వర్గీకరిస్తూ అదే ఏడాది 204 జీవోను ఇచ్చారు. విద్యాశాఖలోని పోస్టులను జీవో 158 ద్వారా, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను జీవో 245 ద్వారా, మండల, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులను జీవోలు 256, 257 ద్వారా లోకల్ క్యాడర్లుగా వర్గీకరించారు. ఫలితంగా సుప్రీంకోర్టు/హైకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం వేర్వేరు లోకల్ క్యాడర్లుగా ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులుగా వర్గీకరించినట్లు అయింది. అవసరమైతే న్యాయ సలహాలను కూడా స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 309 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి రెండు క్యాడర్లను ఏకీకృతం చేస్తూ సర్వీస్ రూల్స్ రూపొందించే అధికారం ఉన్నది. దీనివలన దశాబ్దాల తరబడి ఉపాధ్యాయుల పర్యవేక్షణ పోస్టుల భర్తీకి ఉన్న అడ్డంకి తొలగిపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా 66 పోస్టులకుగాను 64 డిప్యూటీ విద్యాధికారి పోస్టులు, 33 జిల్లాలకుగాను 26 డీఈవో పోస్టులు ఖాళీలు ఉండడంతో విద్యాపాలన కుంటుపడింది. పర్యవేక్షణ పడకేసింది. ఎడ్యుకేషన్ కోడ్ ప్రకారం జరుగాల్సిన విద్యాపాలన అటకెక్కింది. ఫలితంగా ఉపాధ్యాయుల పనితీరు, బోధన, హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫారాల వంటి అంశాలను పర్యవేక్షించే అవకాశం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో 630 మండలాలు ఉండగా...363 మండలాలకు మాత్రమే ఎంఈవో పోస్టులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం మరో 125 పోస్టులు మంజూరు చేసింది. ఇంకా 142 కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు కాలేదు. ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను అమల్లోకి తేవాలంటే ఆ 142తోపాటు కొత్తగా 630 ఎంఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాలి. 'రెండో ఎంఈవో వస్తే ఆ వ్యవస్థను తొలగించే అవకాశం ఉంటుంది. దానివల్ల 1,800 మంది ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలలపై దృష్టి పెట్టవచ్చు. ప్రస్తుతం ఎంఈవోలు అటు పరిపాలనాపరమైన, ఇటు విద్యాపరమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తున్నది. రెండో ఎంఈవో వస్తే వేర్వేరు బాధ్యతలు అప్పగించవచ్చు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ పెరుగుతుంది'. రాష్ట్ర విద్యామంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాశాఖలో పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయడానికి, ఉమ్మడి సర్వీసు నిబంధనలను అమలు చేయడానికి చొరవ చూపి విధానపరమైన నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

# సింహాసనం వణకలేదు, స్పందించింది!




సమాజ విశ్లేషకులు డానీ రాసిన 'సింహాసనం వణికింది' వ్యాసం (31.07.2026) నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై జరిగిన 'కాక్రోచ్' విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా రాసినట్టుగా కనపడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పూర్తిగా టార్గెట్ చేసింది. వ్యాసకర్త ఎక్కడా విద్యార్థుల ఆందోళనకు దారితీసిన పరిస్థితులపై కానీ, విద్యార్థుల డిమాండ్లను విశదీకరించటంపై కానీ, నీట్ లీక్ సూచనలపై కానీ దృష్టి పెట్టలేదు. మోదీని ప్రపంచ నియంతగా చూపించి హిట్లర్ పక్కన చేర్చే ప్రయత్నానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

జంతర్ మంతర్ ఉద్యమం మొదటి కోరిక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ప్రధానమంత్రి విద్యార్థుల కోరిక తీర్చారు. కానీ డానీ మాత్రం, 'ఇంతకాలం ఒక నారటివ్‌ను మన చేత నమ్మించారు: భారత ప్రధాని సర్వశక్తిమంతులు, సర్వజ్ఞులు. వారు అనుకున్నదే జరుగుతుంది. ఎంతటివారైనా వారి పాదాక్రాంతం కావాల్సిందే. వారు హిమాలయాలంత ఎత్తులో ఉంటే, దేశంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట మాత్రమే,' అని వ్యాసకర్త తన ఊహాజనిత కథనం రాశారు. తాను హిమాలయాలంత ఎత్తు అన్న భావన ప్రధానికీ లేదు. తాను తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట అన్న అభిప్రాయం ప్రతిపక్ష నాయకునికీ లేదు, ఆ పార్టీ శ్రేణులకూ లేదు. దేశ ప్రజలకూ లేదు. ఈ రెండు అభిప్రాయాలూ వ్యాసకర్త సొంత అభిప్రాయాలు మాత్రమే. ఆయన దృష్టిలో వారిరువురికీ ఇచ్చిన స్థానం అది. దానిని పాఠకులపై రుద్దే ప్రయత్నం చేశారు. 'షాహీన్ బాగ్, మూడు వ్యవసాయ చట్టాల వ్యతిరేక రైతు ఉద్యమం, మహిళా రెజ్లర్ల ఆందోళనలు వంటి సంఘటనలను సామాజిక వర్గాల ఉద్యమంగా ముద్ర వేసి సమాజం నుంచి వేరు చేశారు,' అంటూ అవి సాధించని విజయాన్ని జంతర్ మంతర్ సాధించిట్లు సూత్రీకరించారు వ్యాసకర్త. అవును, ఆ గత ఉద్యమాల పరిధి, విస్తృతి చిన్నది కాబట్టే అవి దేశవ్యాప్తం కాలేకపోయాయి. వాటి పట్ల కూడా కేంద్రం నియంత పోకడ ఎక్కడా చూపించలేదు. పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. కాబట్టే అవి కొంతకాలం రగిలి శాంతించాయి. ఆ ఉద్యమాలు వేరు. జంతర్ మంతర్ ఆందోళన వేరు. మొదటివి కాస్తో కూస్తో అనుభవం, పెద్దరికం, నిర్దిష్టమైన నిర్మాణంతో ఉద్యమించాయి. జంతర్‌మంతర్‌లో 'బొద్దింకలు' మాత్రమే ఆందోళనలు చేశాయి. నాయకత్వం వహించాయి. ఇవి లేవనెత్తిన అంశం దేశవ్యాప్తమైన యువతకు సంబంధించిన సమస్య. కింది కులాల వారికంటే, అసంఖ్యాక మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల సమస్య. కాబట్టే ఎలాంటి నిర్మాణం, నాయకత్వం, నిధుల సమీకరణ వంటి ముఖ్యమైన అంశాలు లేకున్నా, సోషల్ మీడియా పిలుపుతోనే బలమైన గొంతుకలను సమీకరించాయి, బలంగా వినిపించాయి. మరో కీలకమైన అంశం ఏమిటంటే, ఏ దేశంలోనైనా యువత ఆందోళనలు చాలా వాడిగా వేడిగా ఉంటాయి. వాటి పట్ల ప్రభుత్వాలు చాలా అప్రమత్తంగా ఉంటాయి. కట్టుదాటితే శాంతి భద్రతలు, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఈ ప్రజాస్వామిక స్పృహ కేంద్రానికి బలంగా ఉంది. ఈ ఆందోళనలో కూడా ఎన్నో అపశ్రుతులు దొర్లాయి. మోదీ వ్యతిరేక శక్తులు ఇందులో పనిచేశాయి. రక్షణ బలగాలపై దాడులు జరిగాయి. ప్రధానిని, ఆయన తల్లిని అమానవీయకరమైన వ్యాఖ్యలు చేసి దూషించారు. అవి అవసరం లేదు. ఐనా ఎందుకు చేశారు? బహుశా ఉద్యమాన్ని రక్తపు మడుగుల దిశగా నడిపించాలని అదృశ్య శక్తులు తలపోసి ఉండవచ్చు. ఈ అంశాన్ని పసిగట్టే ప్రధాని 'మన పిల్లలు' అన్న భావనతో సమస్య పరిష్కారం కోసం ముందడుగు వేశారు. ధర్మేంద్ర ప్రధాన్ ఎంత బలమైన నాయకుడు ఐనా, తాను నమ్మిన నేత ఐనా, ఆయన నేతృత్వంలో బీజేపీ గెలుపు గుర్రం అధిరోహించినా, అప్పటికే నీట్‌పై కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకున్నా కూడా, విద్యార్థుల మొదటి డిమాండ్‌ను నెరవేర్చి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించారు ప్రధానమంత్రి. మిగిలిన రెండు డిమాండ్‌లను అంగీకరించారు. ఇది ప్రజాస్వామ్య పాలకుడికి ఉండాల్సిన మొదటి లక్షణం. నియంతలకు ఇలాంటి ఇజం ఉండదు. 'ఈ ఉద్యమం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా నిరూపించింది. నాయకుడు అన్నీ తాను కాకూడదు. ప్రజలను ఉద్యమించేలా చేయాలి. ఇది సీట్ల కోసం, పదవుల కోసం, కూటముల కోసం పరస్పరం తగవులాడుకుంటూ రోజు రోజుకూ బలహీనపడుతున్న విపక్షాలకు ఒక గుణపాఠం. ప్రజలను వీధుల్లోకి తీసుకురండి. ప్రజలకు నాయకత్వం అప్పజెప్పండి' అంటూ విపక్షాలను కూడా నెమలి ఈకల విమర్శతో నిమిరారు వ్యాసకర్త. లేకపోతే తన లోగుట్టు పూర్తిగా బయటపడుతుందని, 'సమాజ విశ్లేషకులు' అన్న పదానికి మరక పడుతోందని జాగ్రత్తపడ్డారు, భయపడ్డారు. వెరసి, ఈ వ్యాసకర్త బొద్దింకల మాటున 'పెద్ద బొద్దింక'గా గుర్తింపు పొందేందుకు తెగ తాపత్రయపడ్డారు. ప్రధానమంత్రిని ఎంత బలంగా బోనులో నిలబెడితే, తనకు అంతే గుర్తింపువస్తుందని చాలా ఆశపడ్డారు.

## సవాళ్లకు సన్నద్ధం చేసే విద్యావిధానం కావాలి

నీట్ పరీక్షా పత్రం పదే పదే లీక్ కావడంతో మొదలైన నిరసన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అసంతృప్తికి వేదికగా మారి దేశవ్యాప్తంగా యువత విద్యావిధానంలో వైఫల్యాలపై ఉద్యమించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టుపట్టిన యువత చివరకు విజయం సాధించింది. మంత్రి రాజీనామాకు ప్రాధాన్యత ఇచ్చారు. కానీ ఆయన స్థానంలో విద్యాశాఖను ఎవరికి అప్పగించారనే అంశాన్ని పట్టించుకోలేదు. మంత్రుల రాజీనామాలు యూపీఏలో ఉంటాయి, కానీ ఎన్డీయేలో కాదు అంటూ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించిన తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో యువత డిమాండ్‌కు ప్రధాని మోదీ తలొగ్గారు. ప్రధాన్ స్థానంలో నియమించిన కొత్త విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని చూస్తే యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయంలా కనిపించడం లేదు. జోషి చదివింది సాధారణ బీఏనే. ప్రపంచానికి ఏఐ సవాల్ విసురుతున్న కాలంలో యువతను దీనికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి విద్యావంతుడైన విద్యాశాఖ మంత్రి అవసరం ఎంతో ఉన్నది. కృత్రిమ మేధ ప్రపంచాన్ని వణికిస్తున్నది. ప్రపంచాన్ని శాసిస్తున్న ఐటీ కంపెనీలు కూడా ఏఐ ప్రభావం ఎంతవరకు ఉంటుందో చెప్పలేక పోతున్నారు. ఎలాన్ మస్క్ లాంటి వారు ఏఐ ఒక్క ఐటీ ఉద్యోగాలనే కాదు, డాక్టర్లు, లాయర్ల వృత్తులను కూడా మింగేస్తుందని జోస్యం చెప్తున్నారు. భారతీయ యువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయంటే అది ఐటీ రంగంతోనే. ఏఐ ఐటీ రంగాన్ని మింగేస్తే మొదట బలయ్యేది భారతీయ యువతనే. ఈ నేపథ్యంలో ఏఐ విసురుతున్న సవాళ్లకు యువతను సన్నద్ధం చేసే విద్యావిధానం ఉండాలి. మన దేశ యువతకు భవిష్యత్తులో ఏఐ, సెమీ కండక్టర్లు, డాటా సైన్స్, రోబోటిక్స్, పరిశోధన వంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి . ఇవన్నీ విద్యావిధానంతో ముడిపడి ఉన్నాయి. మన యువతను 2030–40లో లభించే ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామా? ఆ మేరకు మన విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపడుతున్నామా? లేదా? అనేది మన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

## బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 18, (మన మీ వార్త న్యూస్):-

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన ధీరత్వానికి ప్రతీక అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. నగరంలోని వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద విగ్రహాల పార్క్?లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**సర్వాయి పాపన్న గౌడ్ ఏకమై పోరాడాలి**

సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో బహుజనులు అందరి ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవాలని నరాల సుధాకర్? పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే బీసీ కులాలు అన్ని ఏకమై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల ప్రసాద్, ధర్మనం దేవేందర్, కొయ్యాడ శంకర్, చంద్రకాంత్, శ్రీలత, ఆర్టీసీ శ్రీనివాస్, సాయి బసవ, జయ, అనిల్, సత్యనారాయణ, గంగాధర్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న జిల్లా కేంద్రంలో టి యు సి ఐ ఆధ్వర్యంలో ధర్నా



నిర్మల్ జిల్లా, ఆగష్టు 18(మీ వార్త న్యూస్)

గౌరవ ప్రద జీవన,కనీస వేతనాలపై ఈ నెల 20న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా.(టి యు సి ఐ)దేశ వ్యాప్తంగా ఇచ్చినధర్నా పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ధర్నా చౌక్ లో ఈనెల 20న 12 గంటలకు జరుగు ధర్నాలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేసిన చట్టబద్ధమైన కనీస వేతనాలు కార్మికులు వారి కుటుంబాల వాస్తవ అవసరాలపై ఆధారపడి లేవు అవి శాస్త్రీయంగా నిర్ణయించిన అవసరాల ఆధారిత కనీస వేతనం కంటే చాలా తక్కువగా ఉన్నాయి. వాస్తవంగా ఇవి పేద తక్కువ వేతనాలు ఇవి లక్షలాది మంది కార్మికులను వారి కుటుంబాలను గౌరవప్రదమైన జీవన ప్రమాణాల కంటే తక్కువగా జీవించేలా చేస్తున్నాయి. చట్టబద్ధమైన కనీస వేతనం అనేది నిజమైన అవసరాల ఆధారిత కనీస వేతనంగా ఉండాలని ట్రేడ్ యూనియన్ ఆఫ్ సెంటర్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేస్తుంది అటువంటి వేతనాన్ని 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 1957లో నిర్దేశించిన శాస్త్రీయ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని కోరారు. 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ మరియు గౌరవనీయ సుప్రీంకోర్టు నిర్దేశించిన శాస్త్రీయ సూత్రాలను అంగీకరిస్తూనే నేడు ఉన్న సామాజిక ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని టి యు సి ఐ డిమాండ్ చేస్తుంది. ఈ సమస్య పరిష్కారానికై ఈ నెల 20న జరిగే ఆలిండియా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

## కనకపూర్ గ్రామం లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

లక్ష్మణ్ చందా, ఆగష్టు 18(మీ వార్త న్యూస్,)



నిర్మల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్మల్ డిఎస్పిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ చందా మండలంలోని కనకాపూర్ గ్రామంలో సౌన్ సర్కిల్ సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించబడినది ఇట్టి కార్యక్రమంలో 61 మోటార్ సైకిల్స్ లను మూడు గూడ్స్ క్యారియర్ వెహికల్స్ ల యొక్క పత్రాలను తనిఖీ చేయడం అయినది. మరియు ఇట్టి కార్యక్రమంలో డిఎస్పి పి. శ్రీనివాస్ ప్రజలను ఉద్దేశించి గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మరియు వాటి యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కనకాపూర్ సర్పంచ్ మరియు గ్రామ కమిటీ అందరూ కూడా మేము తప్పనిసరిగా త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని కార్యక్రమంలో హామీ ఇవ్వడం జరిగింది.మరియు సోన్ సిఐ గోవర్ధన్ రెడ్డి యువతకు మత్తు పదార్థాల వ్యసనాలకు బానిస కావద్దని మరియు మంచి మార్గంలో నడవాలని సూచించారు ఇట్టి కార్యక్రమంలో సౌన్ సర్కిల్ ఎస్సైలు గోపి, హన్మశీడ్లు మరియు శ్రావణి పాల్గొనడం జరిగింది.

## సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకల్లో పాల్గొన్న జనసేన నాయకులు: ప్రేమ కుమార్

కూకట్పల్లి ఆగస్టు 18( మన మీ వార్త)



ఈ రోజు కెపిహెచ్బి కాలనీ 3 వ ఫేస్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమమునకు తెలంగాణ రాష్ట్ర గౌడ సంగ నాయకులు రాజేష్ గౌడ్, వినోద్ గౌడ్ ఆహ్వానం మేరకు కూకట్పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టేడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం గౌడ సంగ నాయకులు ప్రేమ కుమార్ ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, పోలబోయిన శ్రీనివాస్ ,గౌడ సంగ నాయకులు , సభ్యులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం..

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 18, (మన మీ వార్త న్యూస్):-

పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి శాఖ'లో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాలిటెక్నిక్? కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నాకు దిగారు. పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ । జీవో నం.97ను రద్దు చేయాలని ఈ సందర్భంగా రఘురాం నాయక్? మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని అన్నారు. దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్యావ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి




విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లొమా విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని రఘురాం డిమాండ్? చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్.97ను ఉపసవరించుకోవాలన్నారు. రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్?డేట్? చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉపసంఘం పచ్చజెండా ఊపిందన్నారు. తాజాగా ఐటీఐలు ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ నిర్వహించిందన్నారు. ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆలాటాడుతోందన్నారు.ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని వాపోయారు. తక్షణమే ఈ ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యుడు కిషోర్, జిల్లా నాయకులు అజేష్, రామ్ చరణ్, నీరజ్, నాగేష్, శివ పవన్, కిషోర్, భాను ,విష్ణు మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు..: కలెక్టర్?

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 18, (మన మీ వార్త న్యూస్):-

పుట్టబోయే శిశువుకు లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్? సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్?లో గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది.

**ఆశించిన స్థాయిలో కమిటీ పనితీరు లేదు..**

ఈ సందర్భంగా కలెక్టర్? మాట్లాడుతూ.. గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘం ఆశించిన స్థాయిలో పనిచేయట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నామ్ కే వాస్తేగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు రాసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్షేత్ర స్థాయిలో గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జనన వివరాలను అనుసరిస్తూ ఆడ, మగ నిష్పత్తిలో ఎక్కువ వ్యత్యాసం ఉంటే, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఈ తరహా వ్యత్యాసం ఎక్కువగా నగరాలు, పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తోందని, దీనిని బట్టి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచితే ఈ తరహా అమానవీయ ఘటనలకు ఆస్కారం ఉండదని సూచించారు.

**గట్టి నిఘ పెట్టాలి..**

ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా, వాటి అమలు సక్రమంగా లేకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదని కలెక్టర్? అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇకపై జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలని, నిబంధలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వారిలో ఎంతమందికి కాన్పు జరిగిందన్నది



పరిశీలించాలన్నారు. గర్భం దాల్చిన మీదట కాన్పు జరగని కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, గర్భ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి ఘటనలను గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందని, తద్వారా ఈ చర్యలకు పాల్పడిన స్కానింగ్ సెంటర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, కమిటీ సభ్యులు ఎస్.సిద్దయ్య, బి.ఆంజనేయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, ఆగస్టు 18 ( మన మీ వార్త):

రామంతాపూర్ మెయిన్ రోడ్డులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సమీపంలో గుడ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గత సంవత్సరం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై మృతులకు నివాళు లర్పించారు. కీ.శే. రాజేంద్ర రెడ్డి, కీ.శే. కాటేపల్లి శ్రీకాంత్ రెడ్డి, కీ.శే. రుద్ర వికాస్, కీ.శే. చెట్టబోయిన సురేష్ యాదవ్ (రామంతాపూర్ యాదవ సంఘం యూత్ అధ్యక్షుడు), కీ.శే. పింజర్ల క్రిష్ణ యాదవ్ (డైమండ్ యాదవ్)ల ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులను





పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నప్రసాదాన్ని అందించారు.మృతుల జ్ఞాపకార్థం అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గుడ్ ఫ్రెండ్స్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

--- ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఆగస్టు 18 ( మన మీ వార్త):





ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకా నగర్ మెయిన్ రోడ్ లోని నేర్దం ఫంక్షన్ హాల్ ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న సేన ఫౌండర్, తెలంగాణ ఉద్యమకారుడు నేర్దం భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో



నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ ఓబీసీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ జిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుడి మధుసూదన్ రెడ్డి తో పాటు స్థానిక కుల సంఘాల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, ఉప్పల్ అసెంబ్లీ బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్దం భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్నా సామాజిక, రాజకీయ, అధికార రంగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆత్మగౌరవం కోసం, "మా నిధులు--మా ఉద్యోగాలు--మా నీరు" అనే నినాదాలతో బీసీ బిడ్డలు ముందుండి పోరాడి త్యాగాలు చేశారని గుర్తుచేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు పూర్తయినా రాష్ట్ర జనాభాలో సుమారు 60 శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా, పరిపాలనా పరంగా తగిన న్యాయం జరగడం లేదని అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచేందుకు ప్రత్యేక రాజకీయ శక్తిగా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీ నాయకులు ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, తీన్మార్ మల్లన్న, విశాలాంధ్ర మహారాజ్, బాలరాజు తదితరులు బీసీల రాజకీయ ప్రాతినిధ్యం కోసం మరింత ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అగ్రకుల పార్టీల వద్ద టికెట్లు అడగకుండా బీసీలకు తామే రాజకీయ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని అన్నారు. ఎమ్మెల్యేలు, మేయర్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలుగా బీసీ అభ్యర్థులను గెలిపించుకుని, తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రితో బీసీల ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, సాకలి ఐలమ్మ, పండుగ సాయన్న, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు అందించిన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని, తెలంగాణలో బీసీలను రాజకీయంగా ఏకతాటిపైకి తీసుకువచ్చి బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.

## రోహిన్ రెడ్డి అద్దె ఇవ్వడం లేదు..తప్పుడు కేసులు పెడుతున్నాడు

**హైదరాబాద్** కాంగ్రెస్ నేత డాక్టర్ రోహిన్ రెడ్డి తమ ఆస్తిని కబ్జా చేయడమే కాకుండా తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని రాజేందర్ జైన్ అనే వ్యక్తి ఆరోపించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 44లో రోహిన్ రెడ్డి ఉంటున్న గెస్ట్ హౌస్ తన భార్య పేరుతో కొనుగోలు చేశానని.. ఈ ఇంటికి సంబంధించిన వివాదం పరిష్కరిస్తానంటూ పదేళ్ల క్రితం రోహిన్ రెడ్డి అద్దె పేరుతో దిగాడన్నారు అయితే పెద్ద చెల్లించకపోగా ఇంటిని సైతం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. సోమవారం ఇంటి ముందుకు వెళ్లిన రాజేందర్ జైన్ ను పోలీసులు బలవంతంగా పోలీసు స్టేషన్ కు తరలించారు.

# బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న

- మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్
- అంబేద్కర్ నగర్ గౌడ సంఘం అధ్యక్షులు రాజ్ కుమార్ గౌడ్

**జవహర్ నగర్ ఆగస్టు 18:(వార్త ప్రతినిధి)**

బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. అబ్బ గోని రాజు గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జవార్ నగర్ డివిజన్ అంబేద్కర్ నగర్ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన. మాజీ ప్రజా ప్రతినిధులు గౌడ కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా.





మాట్లాడుతూ. చట్టాలు లేని రోజులలోనే ప్రజాల హక్కుల కోసం. ఆయన బడుగు వర్గాలకు రాజ్యాధికారం కావాలని కలలు కన్నారు అని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో. మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్. జిల్లా నాయకులు కల్లపెల్లి సదానందం. మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్. మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్. జవహర్ నగర్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్. మాజీ కార్పొరేటర్లు. గౌడుగు వేణు. కుతాడి సాయికుమార్. మారబోని నాగరాణి వెంకటేష్ గౌడ్. అలిగిరి చిత్ర సుబ్రహ్మణ్యం. అబ్బ గోని రాజు గౌడ్. మూల సోమయ్య గౌడ్. పంతంగి సిద్ధులు యాదవ్. కాగిత రాజు యాదవ్. శ్రవణ్ కుమార్ గౌడ్. కృష్ణ గౌడ్. డి ఎస్ ఎస్ వెంకటేశ్వర్లు. మంద ఆనంద్. గజ్వేల్ శంకర్. మహేష్ గౌడ్. మొగిలి పాక పరుశురాం. సురేష్ ముదిరాజ్ పలువురు నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు

# పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- 39వ డివిజన్‌లో క్షేత్రస్థాయి శానిటేషన్ పనులను ఆకస్మికంగా పరిశీలించిన బల్దియా కమిషనర్ టి.వెంకన్న

**మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న ఆదేశించారు. మంగళవారం నగరంలోని 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్ ప్రాంతంలో కమిషనర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనుల నిర్వహణ, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించి, శానిటరీ జవాన్లు, సిబ్బందితో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుధ్య పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో స్వచ్ఛ ఆటోలు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇంటింటికీ వస్తున్నాయా? అని స్థానికులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్న కమిషనర్.. గృహాల నుంచి సేకరించే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేర్వేరుగా సేకరించాలని స్పష్టం చేశారు. చెత్త వేరు చేసి





అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యర్థాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు.
తనిఖీల్లో భాగంగా రోడ్డుపక్కన కన్స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ (జడణ) వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని కమిషనర్ గమనించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను రోడ్డుపై వేసిన భవన యజమానిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై శానిటరీ జవాన్‌ను ఆరా తీశారు. సంబంధిత భవన యజమానికి జరిమానా విధించడంతో పాటు జడణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.
అనంతరం హంటర్ రోడ్ లోని ఏ ఎస్ ఎం కళాశాల వద్ద స్వీపింగ్ మిషన్ల పనితీరును పరిశీలించిన కమిషనర్, పారిశుధ్య పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన పారిశుధ్య నిర్వహణను నిరంతరం కొనసాగించాలని అధికారులకు సూచించారు.
ఈ తనిఖీల్లో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా. రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు నరేందర్, గోల్కొండ శ్రీను, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భీమయ్య తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణపై అధ్యయనం.. బల్దియాలో ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధనా సంస్థ బృందం పర్యటన

- బల్దియా కమిషనర్ వెంకన్నతో సమావేశమైన బృందం....

**మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, ప్రాసెసింగ్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధనా సంస్థ (MSSRF) -- చెన్నై బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పర్యటించింది. ఈ సందర్భంగా బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ టి.వెంకన్నతో మీూ=ఖీ బృందం సమావేశమైంది. నగరంలో అమలవుతున్న పారిశుధ్య నిర్వహణ విధానాలు, ఇంటింటి నుంచి వ్యర్థాల సేకరణ, తడి--పొడి వ్యర్థాల వేరు సేకరణ, స్వచ్ఛ ఆటోల నిర్వహణ, పారిశుధ్య సిబ్బంది విధులు, వ్యర్థాల ప్రాసెసింగ్ తదితర అంశాలపై కమిషనర్‌తో బృంద సభ్యులు చర్చించారు.
అనంతరం బల్దియా శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమై డివిజన్ల వారీగా పారిశుధ్య పనుల నిర్వహణ, సిబ్బంది విధులు, వ్యర్థాల సేకరణలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.
తదుపరి శానిటరీ జవాన్లతో సమావేశమై క్షేత్రస్థాయిలో వారి విధుల నిర్వహణ, ఇంటింటి వ్యర్థాల సేకరణ, పారిశుధ్య పనుల్లో ఎదురవుతున్న సవాళ్లు, ప్రజల నుంచి అందుతున్న సహకారం తదితర అంశాలపై MSSRF బృందం వివరాలు సేకరించింది.
అనంతరం బల్దియా స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో బాలసముద్రం ప్రాంతంలో సమావేశమై ఇంటింటి నుంచి వ్యర్థాల సేకరణ, తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, రోజువారీ రూట్ల నిర్వహణ తదితర అంశాలపై చర్చించింది.
అదేవిధంగా కంపోస్టింగ్, బయోమెథనేషన్ యూనిట్ సిబ్బందితో సమావేశమై సేంద్రియ వ్యర్థాల సేకరణ, కంపోస్టింగ్, బయోమెథనేషన్ ప్రక్రియ, యూనిట్ల నిర్వహణ తదితర అంశాలను బృందం తెలుసుకుంది.
మొదటి రోజు పర్యటనలో భాగంగా నక్కలగుట్టలోని ణ=జని కూడా మీూ=ఖీ బృందం సందర్శించి అక్కడి కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది.
ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధనా సంస్థ--చెన్నై బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు నగరంలోని వివిధ స్థాయిల్లో పారిశుధ్య నిర్వహణతో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బందితో ప్రత్యక్షంగా సమావేశమై వారి అనుభవాలు, సమస్యలు, సూచనలను తెలుసుకుంది. బుధవారం కూడా బల్దియా పరిధిలోని వివిధ ప్రాంతాలను సందర్శించి క్షేత్రస్థాయి





అధ్యయనం కొనసాగించనుంది.
ఈ సమావేశం లో ముఖ్య ఆరోగ్యధికారిడా.రాజారెడ్డి,సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్ కుమార్,ఏం హెచ్ ఓ డా.రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేందర్ సూపరిండెంట్ బాకం సంతోష్ డిప్యూటీ ఇంజనీర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

# సుర్‌మౌంట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఘనంగా ప్రారంభోత్సవం

--- గౌరవ అతిథిగా హాజరైన ఓయూ ఈ.ఎం.ఆర్.సి డైరెక్టర్ పి.రఘుపతి రెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 18 ( మన మీ వార్త):**

సుర్‌మౌంట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఓ .యూ . ఈ ఎం ఆర్ సి డైరెక్టర్ పి. రఘుపతి రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి 70 మందికి పైగా పాఠశాల కరస్పాండెంట్లు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉప్పల్ ప్రాంతంలోని పాఠశాలల కరస్పాండెంట్ల మధ్య ఉన్న స్నేహపూర్వక అనుబంధం, ఐక్యత ఎంత బలంగా ఉందో ఈ కార్యక్రమం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.పాఠశాలల మధ్య పోటీ ఉన్నప్పటికీ అది ఆరోగ్యకరమైన పోటీగా ఉండాలని, ఒకరి విజయాన్ని మరొకరు అభినందిస్తూ విద్యారంగ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయడం అభినందనీయమని అన్నారు. ఒక పాఠశాల ప్రారంభోత్సవానికి ఇంతమంది పాఠశాల ప్రతినిధులు కలిసి హాజరు కావడం ఉప్పల్ విద్యారంగంలో నెలకొన్న పరస్పర గౌరవం, స్నేహభావం, ఐక్యతకు నిదర్శనమని రఘుపతి రెడ్డి అభిప్రాయపడ్డారు. సుర్‌మౌంట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవంతో పాటు ఉప్పల్ ప్రాంతంలోని పాఠశాలల మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని చాటిచెప్పిన ప్రత్యేక కార్యక్రమంగా ఇది నిలిచింది.





## రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శివ్వంపేట, గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పిల్లుట్ల గ్రామానికి చెందిన మంగళి శ్రీనివాస్ (40) బతుకుదెరువు కోసం మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం దూలపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం పని నిమిత్తం సికింద్లాపూర్ మీదుగా స్వగ్రామమైన పిల్లుట్లకు వస్తుండగా మధ్యాహ్నం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సూరారంలోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనతో పిల్లుట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కుంగిన వంతెనపై అధికారుల నిర్లక్ష్యం

- "పరిశీలనలు కాదు.. ప్రజలకు తక్షణ పరిష్కారం కావాలి"

--- బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్

**కూకట్పల్లి ఆగస్టు 18 (మన మీ వార్త)**



ఫతేనగర్: నేతాజీ కాలనీ--శోభన కాలనీల మధ్య కాలువపై ఉన్న వంతెన కుంగిపోయి ప్రమాదకరంగా మారినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
వంతెనకు ఆనుకుని భారీగా చెత్త పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. సుమారు పది రోజుల క్రితం మాజీ కార్పొరేటర్, ఏఈ అధికారులు అక్కడికి వచ్చి పరిస్థితిని పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.
కుంగిపోయిన వంతెనతో పాటు పేరుకుపోయిన చెత్త కారణంగా ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకముందే అధికారులు స్పందించాలని కంచి మహేందర్ డిమాండ్ చేశారు.
అధికారులు వచ్చారు పరిశీలించారు వెళ్లిపోయారు కానీ సమస్య మాత్రం అలాగే ఉంది. పరిశీలనలు, హామీలతో సమస్య పరిష్కారం కాదు. ప్రజలకు తక్షణమే శాశ్వత పరిష్కారం కల్పించాలి అని ఆయన అన్నారు.
ఫతేనగర్‌లో నెలకొన్న ఈ పరిస్థితిపై అధికారులు వెంటనే స్పందించి కుంగిపోయిన వంతెనకు మరమ్మతులు చేపట్టడంతో పాటు పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు"ఇదేనా మన ఫతేనగర్ పరిస్థితి?" అని ఆయన ప్రశ్నించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ములకలపల్లి రాజేష్ ముదిరాజ్

**చిలుకానగర్, ఆగస్టు 18 ( మన మీ వార్త):**



చిలుకానగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్ కాలనీలో చిలుకానగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం నాయకులతో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని కొనియాడారు. కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలనే సమసమాజ, ప్రజాస్వామిక స్ఫూర్తితో పాపన్న గౌడ్ ఆనాడే పోరాడారని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.సర్వాయి పాపన్న గౌడ్ సేవలు, పోరాట స్ఫూర్తిని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ సచివాలయం వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గౌడ కులస్తుల పట్ల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డీసీసీ కార్యవర్గ సభ్యుడు గండి కోట గణేష్, చిలుకానగర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు దండుగుల శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంచర్ల బలరాం, కూరెళ్ల యాదగిరి, జెర్రిపోతుల చంద్రయ్య, మారపాక నాగయ్య, మహేందర్ రెడ్డి, సందీప్, ఉమేష్, ప్రవీణ్ తదితర కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం సభ్యులు, చిలుకానగర్ ప్రజలు పాల్గొన్నారు.ఖ



## నేటి యువత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి : తెల్ల హరికృష్ణ

**కూకట్ పల్లి ఆగస్టు 18 (మన మీ వార్త )**



కూకట్ పల్లి లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా కూకట్ పల్లి గౌడ్ సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వారి ఆహ్వానం మేరకు రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం సభ్యులు, పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల రాజకీయ నాయకులు, అన్ని వర్గాల నాయకులు, గ్రామస్తులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

## రామంతాపూర్‌లో మినీ ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ:

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**

రామంతాపూర్, ఆగస్టు 18 ( మన మీ వార్త):



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా రామంతాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రామంతాపూర్ మినీ ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఘనంగా



ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు. పాపన్న గౌడ్ ఆశయాలను, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు వినయ్ గౌడ్, సర్వే మురళి గౌడ్, తాళ్ల బాలకృష్ణ గౌడ్, సోమశేఖర్, పచ్చిమట్ల అనిల్ గౌడ్, సుదగాని మల్లేష్ గౌడ్, మధు గౌడ్, తాళ్లమంగ గౌడ్, రామచందర్ గౌడ్, సోమయ్య గౌడ్, శ్రీకాంత్ గౌడ్, ప్రెస్ యాదగిరి గౌడ్, రమేష్ గౌడ్, రఘు గౌడ్, బీజేపీ మాజీ కార్పొరేటర్ బండారి శ్రీవాణి, బీజేపీ సీనియర్ నాయకులు హరీష్, జగన్ యాదవ్, గడ్డం సాయికిరణ్, సంతోష్ గుప్తా, శీలం సోమశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భద్రకాళి బండ్ పై సందర్శకులకు అందుబాటులోకి బ్యాటరీ వెహికల్

**- వెహికల్ సేవలను ప్రారంభించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ఎమ్మెల్యేతో పాటు పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, అధికారులు భద్రకాళి బండ్ పై సందర్శకుల సౌకర్యార్థం బ్యాటరీ వెహికల్ సేవలు మంగళవారం అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా



హాజరై బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ ను ప్రారంభించారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బ్యాటరీ వెహికల్ ను ప్రారంభించిన అనంతరం కుడా సిపిఓ అజిత్ రెడ్డి నడపగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, తదితరులు భద్రకాళి బండ్ పై ప్రయాణించారు. ఫాతిమ కెనరా బ్యాంక్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ ఫండ్స్ కింద కొనుగోలు చేసిన బ్యాటరీ వెహికల్ ను కుడా కు అందజేశారు. కాగా ఈ వెహికల్ ను ఎమ్మెల్యే చేతులకు మీదుగా ప్రారంభించడంతో సందర్శకుల సౌకర్యార్థం ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా కుడా ఈఈ భీమ్ రావు, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## పాపన్నగౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి - మాజీ మేయర్ మేకల కావ్య

జవహర్ నగర్, ఆగస్టు 18: (వార్త ప్రతినిధి)



భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాడి, బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడని మాజీ మేయర్ మేకల కావ్య కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని జవహర్ నగర్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ లో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ పాపన్నగౌడ్లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోని యువత ముందుకు సాగాలన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని, అన్ని వర్గాల ప్రజలు ఒకటేనంటూ ఆనాడే చాటిచెప్పాడని గుర్తు చేశారు. మహనీయు ఉత్సవ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండల్ ముదిరాజ్, జిట్టా శ్రీనివాస్ రెడ్డి, సంగీతారాజశేఖర్, రవి, వెంకటేష్ గౌడ్, బాల్రాజ్ , సిద్ధులుయాదవ్, ప్రసాద్ గౌడ్, మహేశ్, సోమయ్య, పొలాస సాయి, దిలీప్, పొలాస అశోక్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

శివంపేట మీ వార్త ప్రతినిధి ఆగస్టు (18):



ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని మంగళవారం మండల స్పెషల్ ఆఫీసర్ ప్రతాప్ సూచించారు. ఈ సందర్భంగా శివ్వంపేట గ్రామంలో రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని ఆయన రైతులకు వివరించారు. అలాగే ఆయిల్‌పామ్ సాగుతో కలిగే ప్రయోజనాలు,పంట సాగు విధానం,రైతులకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు.రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని ప్రతాప్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎవో లావణ్య,ఏఈఓ,సౌజన్య, రవి,చంద్రవేణీ రైతులు ఉన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం.. ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జెడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ. పుష్పలత, సహాయ అధికారి శంకరయ్యతో పాటు గౌడ కుల సంఘ నాయకులు చిర్ర రాజు గౌడ్, గట్టు రమేష్ గౌడ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, అనంత రమేష్ గౌడ్, లక్ష్మణ్, జనగాం శ్రీనివాస్ గౌడ్ తదితరులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కె.ఆర్.



నాగరాజు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. బహుజనుల కోసం పోరాడి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఒక చరిత్ర అని పేర్కొన్నారు. గౌడ కులంలో జన్మించిన పాపన్న గౌడ్ బహుజనుల కోసం పాలకులను ఎదిరించి, స్వరాజ్యాన్ని



స్థాపించి ప్రజలకు సేవ చేశారని తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, సేవలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ కుల సంఘ నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 'చలో ఢిల్లీ'

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపు**

జవహర్ నగర్ ఆగస్టు 18: (వార్త ప్రతినిధి)

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశంలో పేదరికం తీవ్రమై, సామాన్య ప్రజలు అపార కష్టాల్లోకి నెట్టబడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, పాలనలో మార్పు తీసుకురావాలనే నినాదంతో ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాప్రా మండల కౌన్సిల్ సమావేశం గిరిప్రసాద్ భవన్ లో మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమా మహేష్ మాట్లాడుతూ.. బడా వ్యాపార వర్గాల నుండి బీజేపీ కోట్ల రూపాయల చందాలు స్వీకరిస్తూ వారికి మాత్రమే ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరగబోయే 'చలో ఢిల్లీ' ప్రదర్శనను జయప్రదం చేయడానికి జవహర్ నగర్ ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

**రోడ్డు పనులు పూర్తి చేయకపోతే ఉద్యమం తప్పదు:**



జవహర్ నగర్ లో రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే డంపింగ్ యార్డ్ కాలుష్యంతో నరకయాతన అనుభవిస్తున్న ప్రజలకు, రోడ్డు దుమ్ము తోడై తీవ్ర ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాలు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యులు దశరథ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వెంకటాచారి, సహాయ కార్యదర్శులు రాజేశ్వరి, లక్ష్మి నారాయణ, ఏఐటీయూసీ నాయకులు ఎలన్న, నర్సింహా, గిరిజన సమాఖ్య అధ్యక్షురాలు లత, యువజన సంఘం నాయకులు లక్ష్మణ్, నాని,లతో పాటు సీనియర్ నాయకులు అనసూయ, మాధవి, కవిత, జయమ్మ, రాజు, కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాలతో పాటు.. బీసీల సంక్షేమానికీ ప్రాధాన్యం

**- మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి నిజమైన నివాళి**

**- బీసీ విద్యార్థుల భవిష్యత్తు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి: గుజ్జ సత్యం**

హైదరాబాద్, ఆగస్టు 18 (మన మీ వార్త):

మహనీయుల విగ్రహాల ఏర్పాటుతో పాటు వారి ఆశయాలకు అనుగుణంగా బీసీల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సర్వాయి పాపన్న గౌడ్ వంటి మహనీయులు చూపిన సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వ మార్గంలో ప్రభుత్వం మరింత కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ జయంతోత్సవాల కార్యక్రమంలో గుజ్జ సత్యం పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప యోధుడని పేర్కొన్నారు. ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేయడంతో పాటు, పాపన్న గౌడ్ ఆశయాలను సమాజంలో ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. "మహనీయుల విగ్రహాలు మన చరిత్రను, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు గుర్తుచేస్తాయి. అదే స్ఫూర్తితో బీసీ విద్యార్థులకు మెరుగైన విద్య, యువతకు ఉపాధి, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు మరింత బలోపేతం కావాలి" అని గుజ్జ సత్యం అన్నారు. బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు కీలకమని పేర్కొన్న ఆయన.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు



తీసుకోవాలని కోరారు. బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులతో పాటు నిధుల సకాలంలో విడుదల, సమర్థ వినియోగంపైనా దృష్టి పెట్టాలని సూచించారు.

"సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి అంటే ఆయన విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు ఆయన ఆశించిన ఆత్మగౌరవం, సమానత్వం బీసీల జీవితాల్లో ప్రతిఫలించేలా చర్యలు తీసుకోవడం. బీసీ యువత విద్య, ఉపాధి, ఆర్థిక ప్రగతిలో ముందుకు సాగినప్పుడే మహనీయుల ఆశయాలకు నిజమైన గౌరవం లభిస్తుంది" అని గుజ్జ సత్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ రఘురామ్‌నేత, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి. గౌడ్, బీసీ నాయకుడు జిల్లా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్.-ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2వ దశ కార్యశాల.

**- ప్రతి బూత్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి**

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

రాజ్యసభ సభ్యులు డా. అల్కా గుర్జార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ -BLA- 2, బూత్ అధ్యక్షులే పార్టీకి పట్టుకొమ్మలు.

- తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి. ఓటరు జాబితా సవరణ, బూత్ బలోపేతంపై బీజేపీ దిశానిర్దేశం. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2వ దశ వరంగల్ జిల్లా కార్యశాల సత్యం కన్వెన్షన్లో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ అల్కా గుర్జర్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ హాజరయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందు నాయకులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బహుజన వీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ.... ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2వ దశ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. ప్రతి బూత్‌ను రాజకీయంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఓటరు నమోదు ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాలను సరిగ్గా నింపని వారిని గుర్తించి, వారితో తిరిగి సరైన గుర్తింపు పత్రాలతో ఫారాలు పూర్తి చేయించి సబ్మిట్ చేయించే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా, ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసేందుకు నిరంతరం కృషి చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కష్టపడాలని దిశానిర్దేశం చేశారు. బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ అధ్యక్షులే పార్టీకి అసలైన పట్టుకొమ్మలని వారు కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, బోగస్ ఓట్లను తొలగించేలా సమగ్రంగా సర్వే నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసినప్పుడే విజయాలు సాధ్యమవుతాయని, ఇందుకోసం సవరణ ప్రక్రియను కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా




తీసుకోవాలని స్పష్టం చేశారు

ఈ కార్యక్రమంలో S.I.R ఇంచార్జీ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవి, జోనల్ కో ఆర్డినేటర్ విజయ తులసి, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, డాశ్రీశ్రీ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, జలగం రంజిత్ రావు, కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, దీూా-1 ఎరుకల రఘునారెడ్డి, రేసు శ్రీనివాస్, మిట్టపల్లి కపిల్ కుమార్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, బొడకుంట్ల శివశంకర్, మాజీ కార్పొరేటర్ ఆడెపు స్వప్న మరియు జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, దీూా-2 లు పాల్గొన్నారు.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకుని సంరక్షించాలి

- సామజిక బాధ్యత గా భావించాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- నాటడమే కాదు సంరక్షణ కూడా ముఖ్యమేలి
- భవిష్యత్ తరాలకు అటవీ సంపద ని అందిద్దాం
- జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.






కాకతీయ వైద్య కళాశాలలో ఘనంగా మెగా ప్లాంటేషన్ (వన మహోత్సవం) కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి విద్యార్థులు ఒక్కొక్కరు ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కాకతీయ వైద్య కళాశాల (కేఎంసి) వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మెగా ప్లాంటేషన్ (వన మహోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులు కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూపర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే భావనతో మొక్కలను కాపాడితే అవే మనలను కాపాడతాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. వైద్య విద్యార్థులు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని, దానికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తాము వైద్య కళాశాలలో ఐదేళ్లు చదువు పూర్తి చేసే సమయానికి, తాము దత్తత తీసుకున్న మొక్క కూడా ఐదేళ్ల పాటు పెరిగి పెద్దదిగా మారేలా బాధ్యత తీసుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించడంతో పాటు అనేక వ్యాధులను నివారించేందుకు కూడా దోహదపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు.



ఈ కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖ అధికారులు, ముఖ్యంగా ముకుందరెడ్డి, పుల్లశెట్టి, లక్ష్మారెడ్డి తదితరులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో మొక్కలను ఉచితంగా అందించి కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, కాకతీయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలతో ఇంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ, కళాశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు.

నగరంలో భవిష్యత్తులో బహిరంగ ప్రదేశాలు తగ్గిపోయే పరిస్థితుల్లో కళాశాల ప్రాంగణం నగరానికి కీలకమైన గ్రీన్ స్పేస్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించి బతికించడం అంతకంటే ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం నాటిన మొక్కలను కనీసం వచ్చే ఏడాది వరకు జాగ్రత్తగా సంరక్షిస్తే వాటి మనుగడ శాతం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించేందుకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు సంబంధిత శాఖలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

కాకతీయ వైద్య కళాశాల వంటి విద్యాసంస్థల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు, కళాశాల యాజమాన్యం తీసుకోవాలని అధికారులు సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ మాట్లాడుతూ, కాకతీయ వైద్య కళాశాలతో పూర్వ విద్యార్థులకు ఉన్న అనుబంధం, కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే బాధ్యతను ఈ కార్యక్రమం ద్వారా చాటుతున్నామని తెలిపారు. అటవీ శాఖ అధికారులు అందించిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉచితంగా పెద్ద సంఖ్యలో మొక్కలను అందించిన అటవీ శాఖ అధికారులకు అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. మోహన్ దాస్, ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులు, అటవీ శాఖ అధికారులు, పూర్వ విద్యార్థులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కలకలం.. చిన్నారెడ్డి వ్యాఖ్యలపై ఫిర్యాదు

- పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫిర్యాదు
- గాంధీభవన్‌కు భారీగా తరలివచ్చిన వనపర్తి జిల్లా కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు
- వ్యాఖ్యలపై విచారణ జరిపి.. అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ
- పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్న సంకేతాలు

వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 మీ వార్త





హైదరాబాద్ : వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లో రాజకీయ వేడి రాజుకుంది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ, పార్టీ నాయకత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై పార్టీ పరంగా సమగ్ర విచారణ జరిపి, క్రమశిక్షణాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.గాంధీభవన్‌కు భారీగా తరలివచ్చిన నేతలు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్‌చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో గాంధీభవన్‌కు చేరుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి తమ అభ్యంతరాలను వివరించారు.

**కాంగ్రెస్ మాకు కన్నతల్లిలాంటిది...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తమకు కేవలం రాజకీయ పార్టీ కాదని, కన్నతల్లిలాంటి పార్టీ అని పేర్కొన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేసి పనిచేస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఎవరైనా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.పార్టీపై ఆరోపణలు కార్యకర్తల్లో ఆవేదన, కాంగ్రెస్ పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందనే విధంగా వ్యాఖ్యలు చేయడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిందించేలా మాట్లాడటం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు.పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నాయకుల మధ్య విభేదాలు సృష్టించేలా, కార్యకర్తలను నిరుత్సాహపరిచేలా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. పార్టీకి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసిన వారిపై అధిష్ఠానం దృష్టి సారించి, వాస్తవాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

**ఫిర్యాదుపై మహేష్‌కుమార్ గౌడ్ సానుకూల స్పందన...**

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు సమర్పించిన ఫిర్యాదుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. చిన్నారెడ్డి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై తగిన విచారణ చేపట్టి, పార్టీ పెద్దలతో చర్చించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.పార్టీలో ప్రతి నాయకుడికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉన్నప్పటికీ.. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, పార్టీ నాయకత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం మాత్రం ఆమోదయోగ్యం కాదని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేసినట్లు తెలిపారు.క్రమశిక్షణే కీలకం, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన తరుణంలో నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యత అత్యంత అవసరమని వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ విభేదాలు పార్టీ ప్రయోజనాలకు నష్టం కలిగించే స్థాయికి వెళ్లకూడదన్నారు.పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై అధిష్ఠానం తగిన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం తమకు ఉందని వారు తెలిపారు. పార్టీ క్రమశిక్షణను కాపాడుతూ కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**వనపర్తి కాంగ్రెస్‌లో ఐక్యతకు పరీక్ష...**

చిన్నారెడ్డి వ్యాఖ్యల వ్యవహారం ప్రస్తుతం వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం.. మరోవైపు భారీ సంఖ్యలో జిల్లా నాయకులు గాంధీభవన్‌కు తరలిరావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. అధిష్ఠానం విచారణ అనంతరం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? చిన్నారెడ్డి వ్యాఖ్యలపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయా? లేక ఇరువర్గాల మధ్య సయోధ్యకు ప్రయత్నిస్తారా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది...

## ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయక రైతుల ఆవేదన

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి ఆగస్టు (19):



బోజ్యతండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వైర్లు మరమ్మతులకు గురై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని సోమవారం గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై విద్యుత్ సిబ్బందికి పలుమార్లు సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించలేదని రైతులు వాపోయారు. విద్యుత్ సిబ్బంది స్పందించకపోవడంతో చేసేదేమీ లేక రైతు బద్దు నాయక్ స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని తండావాసులు తెలిపారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు

## మానసిక వికలాంగురాలు అదృశ్యం

జవహర్ నగర ఆగస్టు 18: (వార్త ప్రతినిధి)


సాయిప్రియ(ఫైల్)

ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఓ మానసిక వికలాంగురాలు అదృశ్యమైన ఘటన జవహర్ నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ అంబేద్కర్ నగర్ వేముల అనూష, భర్త, పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ఆమె కుమార్తె వేముల సాయిప్రియ అలియాస్ గంగా(14) మానసికంగా బాధపడుతూ ఇంటివద్దనే ఉంటుంది. ఈ నెల 17న తల్లి అనూష పనికోసమని బయటకు వెళ్లి ఇంటికి వచ్చేలోపు సాయిప్రియ కనిపించలేదు. దీంతో ఆమె ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు తల్లి అనూష జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




వరంగల్ జిల్లా: వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు, రిటైర్డ్ ఐపీఎస్ గారు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ గారితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆకారపు అరుణ్ పటేల్



ఉప్పల్, ఆగస్టు 18 ( మన మీ వార్త):



వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ, బహుజన వీరుడు, సామ్రాజ్యవాద శక్తులకు ఎదురొడ్డి పోరాడిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సమానత్వం, ఆత్మగౌరవం కోసం పాపన్న చూపిన పోరాట బాట నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. బహుజనుల హక్కులు, ప్రాంతీయ అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి నగర్ గౌడ్ సంఘం అధ్యక్షులు మల్లేష్ గౌడ్, సోమశేఖర్ గౌడ్, శంకరయ్య పూజారి, సోమయ్య, రామంతాపూర్ గౌడ్ సంఘం అధ్యక్షులు అనిల్ గౌడ్, గడ్డం సాయి, శ్రీశైలం, కృష్ణ గౌడ్, మల్లేష్ గౌడ్, నరేష్ గౌడ్, ఎల్లాచారి, సుధాకర్, శంకర్‌తో పాటు పలువురు గౌడ్ సంఘం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి మండల వ్యాప్తంగా ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

ఆగస్టు 18 మనం మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి



బహుజనుల ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న 367 జయంతి వేడుకలు వెల్దుర్తి మండల వ్యాప్తంగా మంగళవారం రోజు ఘనంగా నిర్వహించారు. వెల్దుర్తి గౌడ కులస్తులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న నినాదాన్ని నమ్మిన వ్యక్తి ఆయన బహుజనుల గుండెల్లో చిరస్మరణీయుడైన ప్రభుత్వాలు ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యపుస్తకాలలో పొందుపరచాలని యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవించాలని గ్రామ గ్రామాన ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు ఈ కార్యక్రమంలో హనుమాద్రి బాలా గౌడ్ శాకారం వెంకటేష్ గౌడ్ అంగడిపేట రమేష్ గౌడ్ నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# తులం బంగారం మాట ఏమైంది..?

## అఖిలపక్షం ఆధ్వర్యంలో వెల్దుర్తి బంద్ సంపూర్ణం

**ఆరవ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు**

**ఆగస్టు 18 మనం మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి**



తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తి పట్టణంలోని ఏర్పాటు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన వెల్దుర్తి బంద్ సంపూర్ణంగా కొనసాగింది



ఉదయం నుండే వ్యాపార వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా బందులో పాల్గొన్నాయి. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు బంధు నిర్వహించి భారీ ర్యాలీగా పురవీధుల గుండా తిరుగుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తి లోను ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తా వద్ద మానవహారం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెల్దుర్తి పట్టణంలోని స్కూలు ఏర్పాటు చేసినట్లయితే చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు సౌకర్యంగా ఉంటుంది అని మారుమూల గ్రామాలలో ఆ స్కూలును ఏర్పాటు చేసినట్లయితే రవాణా సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తిలోని ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కోదండశేఖర్ గౌడ్ చందు కుమ్మరి పవన్ గణేష్ గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు

## ఆదర్శనగర్‌లో పట్టపగలే చోరీ

- తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడిన దుండగులు
- 10 తులాల 8 గ్రాముల బంగారం.. 24 గ్రాముల వెండి.. రూ.30 వేల నగదు అపహరణ
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

**వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగష్టు 18 మీ వార్త**



వనపర్తి పట్టణంలోని నాగవరం శివారు ఆదర్శనగర్ కాలనీలో ఇంటి తాళాలు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం. ఆదర్శనగర్ కాలనీలో నివాసం ఉంటున్న నందిమల్ల శైలజ, భర్త ఆంజనేయులు ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ఈ నెల 17న ఉదయం సమయంలో ప్రవేశించారు. ఇంటి ప్రధాన తాళంతోపాటు బీరువా తాళాన్ని పగలగొట్టి అందులో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదును అపహరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.చోరీకి గురైన వాటిలో సుమారు 10 తులాల 8 గ్రాముల బంగారు ఆభరణాలు, 24 గ్రాముల వెండి వస్తువులు, రూ.30 వేల నగదు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాళాలు పగలగొట్టి.. బీరువా ఖాళీ,ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాను తెరిచినట్లు పోలీసులు తెలిపారు. చోరీ జరిగిన విషయం గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు,బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రామచంద్రయ్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన ఆధారాలు, పరిసర ప్రాంతాల్లోని సమాచారం ఆధారంగా నిందితుల ఆచూకీ కోసం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.వరుస చోరీల నేపథ్యంలో కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు...

## కేసీఆర్ చేసినదే అసలైన సోషల్ జస్టిస్

## దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి

**హనుమకొండ :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసినదే అసలైన సోషల్ జస్టిస్ అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కలను కేసీఆర్ సాకారం చేశారని, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్నారని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బీసీ, మైనారిటీల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. తొలి డిప్యూటీ సీఎంగా దళిత నేతకు, తొలి స్పీకర్గా బీసీ నేతకు అవకాశం కల్పించడంతో పాటు అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత కేసీఆర్దేనని తెలిపారు. అయితే రేవంత్రెడ్డి పాలనలో సోషల్ జస్టిస్ ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పరకాల పర్యటనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సీఎం పర్యటనతో పరకాలకు ఒరిగిందేమీ లేదని, రైతులకు యూరియా అందించడం, నియోజకవర్గానికి సాగునీరు తీసుకురావడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి మాట్లాడలేదని ఆరోపించారు. అక్కంపేట గ్రామం ఇప్పటికీ రెవెన్యూ గ్రామంగా మారిందా లేదా అనే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో ఏది మాట్లాడినా చెల్లుతుందనే భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు

## అనంతపురంలో మర్డర్

అనంతపురంలోని శ్రీనగర్ కాలనీ అయ్యప్ప స్వామి ఆలయం వెనుకవైపు గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అటుగా వెళ్తున్న స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగో పట్టణ సీఐ మస్తాన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు, హత్యకు పాల్పడిన వ్యక్తుల ఆచూకీ కోసం విచారణ కొనసాగుతోంది.

## రోహిన్ రెడ్డి అద్దె ఇవ్వడం లేదు..

## తప్పుడు కేసులు పెడుతున్నాడు

**హైదరాబాద్** కాంగ్రెస్ నేత డాక్టర్ రోహిన్ రెడ్డి తమ ఆస్తిని కబ్జా చేయడమే కాకుండా తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని రాజేందర్ జైన్ అనే వ్యక్తి ఆరోపించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 44లో రోహిన్ రెడ్డి ఉంటున్న గెస్ట్ హౌస్ తన భార్య పేరుతో కొనుగోలు చేశానని.. ఈ ఇంటికి సంబంధించిన వివాదం పరిష్కరిస్తానంటూ పదేళ్ల క్రితం రోహిన్ రెడ్డి అద్దె పేరుతో దిగాడన్నారు అయితే పెద్ద చెల్లించకపోగా ఇంటిని సైతం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. సోమవారం ఇంటి ముందుకు వెళ్లిన రాజేందర్ జైన్ ను పోలీసులు బలవంతంగా పోలీసు స్టేషన్ కు తరలించారు.












- కల్యాణలక్ష్మి కత్తిరిస్తే.. మహిళల కదనభేరి మోగుతుంది
- పేదింటి ఆడబిడ్డల పథకాలపై 'కోత' కుట్రా..?
- హామీలు ఇచ్చి.. హామీలు మరిచారా?
- రేవంత్ సర్కార్‌పై నిరంజన్‌రెడ్డి నిప్పులు
- ఆడబిడ్డల జోలికొస్తే ఊరుకునేది లేదు
- వనపర్తిలో బీఆర్ఎస్ మహా నిరసన
- రాజీవ్‌చౌరస్తాలో మార్మోగిన నినాదాలు
- కల్యాణలక్ష్మి-షాదీముబారక్‌పై స్పష్టత ఇవ్వాల్సిందే
- ఆసరా రూ.4 వేల హామీ ఎక్కడ..? మహిళలకు రూ.2,500 ఎక్కడ..?
- రైతుల నీళ్లపైనా నిర్లక్ష్యమేనా..? పాలమూరు ప్రాజెక్టులపై గళమెత్తిన మాజీ మంత్రి
- నిరసనలకు అనుమతి నిరాకరణపై మండిపాటు...ప్రజల గొంతు నొక్కలేరు
- మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగష్టు 18 మీ వార్త**

తెలంగాణ రాజకీయాల్లో సంక్షేమ పథకాలపై మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కొనసాగింపు, ఎన్నికల సమయంలో ఇచ్చిన తులం బంగారం హామీ అమలు, ఆసరా పింఛన్ల పెంపు తదితర అంశాలను కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరుబాట పట్టింది.కాంగ్రెస్ కుట్రలపై బీఆర్ఎస్ కదనభేరి' పేరుతో వనపర్తి రాజీవ్‌చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడంతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

**కల్యాణలక్ష్మిపై కన్నేస్తే.. మహిళల ఆగ్రహం తప్పదు...**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసాను అందిస్తున్నాయని నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇలాంటి పథకాలను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పథకాలను ప్రారంభించిందని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అవి అండగా నిలిచాయని చెప్పారు. పథకాల విషయంలో ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

**తులం బంగారం ఎక్కడ...?**

ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలు విషయంలో ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు.మహిళలు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు. మాట ఇచ్చి తప్పితే ప్రజలు నిలదీస్తారని, ఎన్నికల హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.కోర్టు అంశంలో ప్రభుత్వంపై ఆరోపణలు,కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై నిరంజన్‌రెడ్డి ప్రభుత్వం తీరును ప్రశ్నించారు. కోర్టులో ప్రభుత్వం సమర్థంగా తన వాదనను వినిపించాల్సి ఉన్నప్పటికీ కౌంటర్ దాఖలు విషయంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు.పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాల విషయంలో ప్రభుత్వం న్యాయపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పథకాలను కొనసాగించాలనే చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

**2014లో మొదలై.. లక్షల కుటుంబాలకు అండగా...**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు తెలంగాణలో పేద కుటుంబాలకు అండగా నిలిచాయని మాజీ మంత్రి తెలిపారు. ప్రారంభంలో నిర్ణయించిన ఆర్థిక సహాయాన్ని కాలక్రమేణా పెంచుతూ వచ్చామని చెప్పారు. 2014 నుంచి 2023 వరకు లక్షలాది మంది లబ్ధిదారులకు వేల కోట్ల రూపాయల మేర సహాయం అందించామని పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లి ఆర్థిక భారంగా మారకుండా ఈ పథకాలు ఉపయోగపడ్డాయని అన్నారు. కరోనా కాలంలో కూడా సంక్షేమ పథకాలను కొనసాగించామని గుర్తుచేశారు. మహిళల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు.

**కేసీఆర్ పాలనలో సంక్షేమం.. కాంగ్రెస్ పాలనలో విధ్వంసం...**

కేసీఆర్ పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లామని నిరంజన్‌రెడ్డి అన్నారు. సంక్షేమం, వ్యవసాయం, సాగునీరు, విద్యుత్ తదితర రంగాల్లో అనేక కార్యక్రమాలు అమలు చేశామని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల విషయంలో ప్రజల్లో అనిశ్చితి నెలకొందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**ఆసరా పింఛన్ల హామీపై ప్రశ్నల వర్షం...**

అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని నిరంజన్‌రెడ్డి అన్నారు. దివ్యాంగులకు మరింత ఎక్కువ పింఛన్, ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు.ఆ హామీల అమలు ఎక్కడ జరిగిందో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయొద్దని అన్నారు.

**రైతులకు సాగునీరు ఎక్కడ..?**

పాలమూరు ప్రాంత రైతుల సాగునీటి సమస్యను కూడా నిరంజన్‌రెడ్డి ప్రస్తావించారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి లభ్యతను తెలంగాణ రైతుల ప్రయోజనాలకు పూర్తిస్థాయిలో వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీపడం,పోతిరెడ్డిపాడు ప్రాంతాన్ని సందర్శించేందుకు వెళ్లిన తమను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అడ్డుకున్నారని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ హక్కుల కోసం ప్రశ్నించడం తప్పా అని నిలదీశారు.రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, నీటి విషయంలో నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు.

**నిరసనకు అనుమతి ఇవ్వకపోవడంపై ఫైర్...**

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజల హక్కు అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలపై ఆందోళన చేస్తున్న వారిని అడ్డుకోవడం సరికాదని అన్నారు. ప్రజల గొంతును అణచివేయడం ద్వారా సమస్యలను పరిష్కరించలేరని వ్యాఖ్యానించారు.అధికారులూ.. ప్రజల పక్షాన నిలబడండి, ప్రభుత్వానికి వంతపాడటం కాకుండా అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలని నిరంజన్‌రెడ్డి సూచించారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కోరారు.

**పాలమూరు-రంగారెడ్డిపై పోరాటం...**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టడం సహించబోమని నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టు పూర్తి చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రైతులకు సాగునీరు అందించాల్సిందేనని డిమాండ్ చేశారు.ప్రాజెక్టులు, నీటి హక్కులు, రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ప్రజలతో కలిసి ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

**మహిళలే బీఆర్ఎస్ కదనభేరికి బలం...**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మహిళలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి తరలివచ్చారు. మహిళల పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉందని, పథకాలపై ఎలాంటి కోతలు విధించకూడదని వారు కోరారు.ప్రజల హక్కుల కోసం రోడ్లపైకి వస్తాం,ప్రజల సమస్యలపై ప్రశ్నించే హక్కును ఎవరూ హరించలేరనిమాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు, రైతుల సమస్యలు, సాగునీరు, పెన్షన్లు, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ప్రజల హక్కులను కాపాడేందుకు అవసరమైతే దశలవారీగా మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు.

**భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు...**

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, కె.మాణిక్యం,మహిళా సర్పంచులు శోభ, పద్మ, రాజమ్మ, నందిమల్ల శారద, నాగమ్మ, షెమీం, కౌన్సిలర్లు భారతి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, మురళీసాగర్, శ్రీకర్‌గౌడ్, స్వాతి హరిబాబు, శిరీష రమేష్‌గౌడ్, ఏర్వ అరుణ శ్రీనివాసులు, శంకరమ్మ బాబునాయక్, విజయ్‌కుమార్, రఘువర్ధన్‌రెడ్డి, దేవర్ల నరసింహ, మాధవ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి.మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, గులాం ఖాదర్‌ఖాన్, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, స్టార్ రహీమ్, సమద్, ఆరీఫ్, ఫజల్, వెంకట్‌సాగర్, సూర్యవంశం గిరి, హేమంత్ ముదిరాజ్, చిట్యాల రాము, మాజీ సర్పంచి శారద, కుమ్మరి యాదమ్మసత్యం, బాల్‌చంద్రయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు...

## ఆర్టీసీ డ్రైవర్, శ్రామిక్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**మహబూబ్ నగర్** మహబూబ్నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పరిధిలోని జిల్లాలకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మరియు శ్రామిక్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో మహబూబ్నగర్ జిల్లా నుంచి 21 మంది, నాగర్కర్నూల్ జిల్లా నుంచి 21 మంది, వనపర్తి జిల్లా నుంచి 14 మంది, గద్వాల జిల్లా నుంచి 14 మంది, నారాయణపేట జిల్లా నుంచి 14 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 84 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. వీరిలో 64 మంది డ్రైవర్ పోస్టులకు, 20 మంది శ్రామిక్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతున్నది జిల్లా ఎస్పీ డి.జానకి, ప్రక్రియను పరిశీలించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ పరిశీలించి, ప్రక్రియను సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ంఖీ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, యా రుక్మిణీ భాయ్, ఖీఎలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ స్ఫూర్తితో బహుజన రాజ్యాధికార చైతన్యం








- సంకిరెడ్డిపల్లిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు
- నూతన విగ్రహావిష్కరణ.. ఘనంగా నివాళులు
- కులమత భేదాలు లేని సమసమాజమే పాపన్న గౌడ్ లక్ష్యం
- ఓటే మన చేతిలో ఉన్న ప్రజాస్వామ్య ఆయుధం
- బహుజనులు రాజకీయంగా చైతన్యవంతులు కావాలి
- అసెంబ్లీలో బహుజనుల ప్రాతినిధ్యం పెరగాలి
- యువత చరిత్ర తెలుసుకుంటేనే కొత్త చరిత్ర సృష్టించగలరు
- ప్రజలు కోరితే పెద్ద కొడుకులా సేవ చేస్తా" -- దామోదర్ గౌడ్
- ప్రజల ఆశీర్వాదం ఉంటే దేవరకద్ర నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగష్టు 18 మీ వార్త

కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామం లో కులమతాలు, వర్గాల వివక్షకు తావులేకుండా సమాజంలోని అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సమాన భాగస్వామ్యం కల్పించాలనే ప్రజాస్వామ్య స్ఫూర్తితో పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వక్తలు కొనియాడారు. పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా సంకిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు.
గండోళ్ల దామోదర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకిరెడ్డిపల్లి గ్రామంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై దామోదర్ గౌడ్‌ను గౌడ సోదరులు, గ్రామస్తులు అభినందించారు. పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు పరిచయం చేసేలా విగ్రహ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

**12 వేల సైన్యాన్ని సమీకరించిన మహావీరుడు పాపన్న...**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నాటి పరిస్థితుల్లోనే ప్రజలను ఏకం చేసి భారీ సైన్యాన్ని సమకూర్చుకుని పోరాటం సాగించారని వక్తలు గుర్తుచేశారు. సుమారు 12 వేల మంది సైన్యాన్ని సమీకరించి తన కాలంలోనే అసాధారణమైన పోరాట పటిమను ప్రదర్శించిన మహావీరుడిగా పాపన్న గౌడ్ చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ప్రజలను ఏకం చేయడం, అణచివేతను ఎదుర్కోవడం, సమానత్వ భావనను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాల్లో పాపన్న గౌడ్ చూపిన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు.పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికి చెందిన నాయకుడు కాదు.. సమసమాజం కోసం పోరాడిన ప్రజానాయకుడు" అని వక్తలు పేర్కొన్నారు.రాజకీయ అధికారం లేకుంటే సమస్యలకు శాశ్వత పరిష్కారం లేదు, సమాజంలో జనాభా పరంగా పెద్ద సంఖ్యలో ఉన్న వర్గాలు రాజకీయంగా కూడా తమ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు.విద్య, ఉద్యోగాలు, ఆర్థిక రంగాలతో పాటు రాజకీయ రంగంలోనూ బహుజనులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన సాధనమని, ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు.

**ఓటు మన చేతిలో ఉన్న కత్తి లాంటి ఆయుధం...**

ఓటు హక్కును వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ భవిష్యత్తు కోసం వినియోగించాలని వక్తలు సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకునే విషయంలో ప్రతి ఓటరు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి,బీసీలకు జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు.విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగాలంటే సామాజిక, రాజకీయ చైతన్యం అవసరమని అన్నారు. బీసీ వర్గాల్లోని వివిధ కులాలు పరస్పర విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.
విభజన కాదు ఐక్యతే బహుజనుల బలం అని వక్తలు స్పష్టం చేశారు.

**తెలంగాణ పునర్నిర్మాణం రాజకీయ ప్రాతినిధ్యంతోనే...**

తెలంగాణ పునర్నిర్మాణం అంటే కేవలం రహదారులు, చెరువులు, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధి మాత్రమే కాదని వక్తలు అన్నారు.సమాజంలోని అన్ని వర్గాలకు పాలనా వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లభించినప్పుడే సమగ్ర పునర్నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.తెలంగాణ అసెంబ్లీలో బహుజన వర్గాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు ఎన్నికై ప్రజల గొంతుకను వినిపించాల్సిన అవసరం ఉందన్నారు.యువతే మార్పుకు చోదకశక్తి,బహుజన సమాజంలో రాజకీయ చైతన్యం పెంచేందుకు యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో యువతను ఒకచోట చేర్చి చరిత్ర, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.చరిత్ర తెలియని సమాజం భవిష్యత్తును నిర్మించుకోలేదు. మన చరిత్ర తెలుసుకున్నప్పుడే కొత్త చరిత్ర సృష్టించగలం" అని వక్తలు పేర్కొన్నారు.

**దామోదర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు...**

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవరకద్ర అసెంబ్లి ఇన్‌చార్జ్ దామోదర్ గౌడ్ మాట్లాడుతూ. ..సంకిరెడ్డిపల్లి గ్రామంలో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీలకు అతీతంగా పనిచేయాలని సూచించారు.ఇది మా పార్టీ.. అది మీ పార్టీ అనే తేడాలు చూపకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలి. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలి. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అందుబాటులో ఉండాలి" అని దామోదర్ గౌడ్ సూచించారు.

**ప్రజలు కోరితే పెద్ద కొడుకులా సేవ చేస్తా...**

సంగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు తన వంతు సేవ చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని దామోదర్ గౌడ్ తెలిపారు.ప్రజలు నన్ను కోరితే వారి ఇంట్లో ఒక పెద్ద కొడుకులా పనిచేస్తా. ప్రజల సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కారం కోసం కృషి చేస్తా అని హామీ ఇచ్చారు.ప్రజల ఆశీర్వాదం ఉంటే దేవరకద్ర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే తన ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.ప్రజల కోరికే నా లక్ష్యం. మీ ఆశీర్వాదం ఉంటే ప్రజా సేవ కోసం మరింత ముందుకు వస్తా అని అన్నారు.

**అధికారం కోసం కాదు.. ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి...**

ప్రజా సేవను తన ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నానని దామోదర్ గౌడ్ పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులే నిజమైన ప్రజాసేవకులని పేర్కొన్నారు.పాపన్న స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వామన్ గౌడ్ మాజీ జడ్పీ చైర్మన్, నగేష్ ముసాపేట మండల ఇన్‌చార్జ్, కొత్త శీను అడ్డాకుల మండల ఇన్‌చార్జ్, కరాటే శీను వనపర్తి, బాబు గౌడ్ లెక్చరర్ తదితరులు మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ చూపిన ఐక్యతా స్ఫూర్తిని నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.కులాల మధ్య పరస్పర గౌరవం, సామాజిక ఐక్యత, విద్య, ఉపాధి, రాజకీయ చైతన్యంపై దృష్టి పెట్టాలని కోరారు.పాపన్న గౌడ్ విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు ఆయన చరిత్రను పరిచయం చేసే అవకాశం ఏర్పడిందన్నారు.పాపన్న గౌడ్ స్ఫూర్తి.. ఐదు ప్రధాన సందేశాలు. 1. సమానత్వం కోసం పోరాటం: కులమత భేదాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే భావన. 2. ప్రజల ఐక్యత: వివిధ వర్గాలను ఏకం చేసి పోరాట శక్తిగా మార్చిన స్ఫూర్తి. 3. రాజకీయ చైతన్యం: ప్రజాస్వామ్యంలో ఓటు విలువను గుర్తించి చైతన్యంతో నిర్ణయాలు తీసుకోవాలనే పిలుపు. 4. యువత పాత్ర: చరిత్ర, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం. 5. ప్రజా ప్రాతినిధ్యం: సమాజంలోని అన్ని వర్గాలకు పాలనలో తగిన ప్రాతినిధ్యం ఉండాలనే ఆకాంక్ష.

**శానిటేషన్ కార్మికులకు దామోదర్ గౌడ్ సన్మానం...**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల సందర్భంగా గ్రామ పారిశుద్ధ్యాన్ని కాపాడుతూ నిరంతరం సేవలందిస్తున్న శానిటేషన్ వర్కర్లను దేవరకద్ర అసెంబ్లీ ఇన్‌చార్జ్ దామోదర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని ఆయన అన్నారు.
ఎండ, వానను లెక్కచేయకుండా గ్రామ పరిశుభ్రత కోసం పనిచేస్తున్న కార్మికులను అభినందిస్తూ వారికి శాలువాలతో సన్మానం చేసి గౌరవించారు. సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం పనిచేసే కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని దామోదర్ గౌడ్ పిలుపునిచ్చారు.గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో గొప్పది. వారి సేవలను గుర్తించి గౌరవించడం మన బాధ్యత" అని దామోదర్ గౌడ్ పేర్కొన్నారు.

**నాయకులు, గ్రామస్తుల భారీగా పాల్గొనడం...**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో దేవరకద్ర అసెంబ్లీ ఇన్‌చార్జ్ దామోదర్ గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ వామన్ గౌడ్, ముసాపేట మండల ఇన్‌చార్జ్ నగేష్, అడ్డాకుల మండల ఇన్‌చార్జ్ కొత్త శీను, వనపర్తికి చెందిన కరాటే శీను, లెక్చరర్ బాబు గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, గౌడ సంఘం సభ్యులు, యువత, గ్రామస్తులు పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.పాపన్నను స్మరించడమే కాదు.. ఆయన ఆశయాలను ఆచరించాలన్నారు.సంకిరెడ్డిపల్లిలో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు కేవలం జయంతి కార్యక్రమానికే పరిమితం కాకుండా సామాజిక, రాజకీయ చైతన్యానికి వేదికగా నిలిచాయి.పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు ఆయన ఆశయాలైన సమానత్వం, ఐక్యత, ధైర్యం, ప్రజా చైతన్యం, సామాజిక న్యాయం వంటి విలువలను సమాజంలో బలోపేతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి యువతకు మార్గదర్శకం కావాలి.. బహుజన సమాజం ఐక్యంగా ముందుకు సాగాలి.. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువను గుర్తించాలి అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమంలో వామన్ గౌడ్ -- మాజీ జడ్పీ చైర్మన్, నగేష్ -- ముసాపేట మండల ఇన్‌చార్జ్, కొత్త శీను -- అడ్డాకుల మండల ఇన్‌చార్జ్, కరాటే శీను -- వనపర్తి, బాబు గౌడ్ -- లెక్చరర్ తదితర నాయకులు, గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు, యువత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు....

## కేసీఆర్ చేసినదే అసలైన సోషల్ జస్టిస్ దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి

**హనుమకొండ :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసినదే అసలైన సోషల్ జస్టిస్ అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కలను కేసీఆర్ సాకారం చేశారని, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్నారని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బీసీ, మైనారిటీల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. తొలి డిప్యూటీ సీఎంగా దళిత నేతకు, తొలి స్పీకర్గా బీసీ నేతకు అవకాశం కల్పించడంతో పాటు అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత కేసీఆర్దేనని తెలిపారు. అయితే రేవంత్రెడ్డి పాలనలో సోషల్ జస్టిస్ ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పరకాల పర్యటనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సీఎం పర్యటనతో పరకాలకు ఒరిగిందేమీ లేదని, రైతులకు యూరియా అందించడం, నియోజకవర్గానికి సాగునీరు తీసుకురావడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి మాట్లాడలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు రంగులు వేసి కాంగ్రెస్ ప్రభుత్వం తామే చేసినట్లుగా ప్రచారం చేసుకుంటోందని అన్నారు. టెక్స్టైల్ పార్కు, వంద పడకల ఆసుపత్రి వంటి అభివృద్ధి పనులను బీఆర్ఎస్ హయాంలోనే తీసుకొచ్చామని, గత మూడేళ్లలో పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్రెడ్డి చేసిన వ్యాఖ్యలను చల్లా ధర్మారెడ్డి తప్పుబట్టారు. రాజకీయ విమర్శలు చేయడంలో హద్దులు పాటించాలని, కుటుంబాల జోలికి వెళ్లడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ వంద జన్మలు ఎత్తినా ఆయనను ఏమీ చేయలేరని, ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఆనవాళ్లను కూడా చెరపలేరని అన్నారు. అక్కంపేట గ్రామం ఇప్పటికీ రెవెన్యూ గ్రామంగా మారిందా లేదా అనే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో ఏది మాట్లాడినా చెల్లుతుందనే భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు

## ఇనుగుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు,



డైనింగ్ హాల్, వంటశాల మరియు విద్యార్థుల వసతి గదులను స్వయంగా పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా ప్రమాణాలను, అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. తాగునీటి శుద్ధి ప్లాంట్, పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు.
ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని, విద్యార్థులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే స్థానిక వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్యం అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ ఇనుగుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూ విద్యార్థులతో కలెక్టర్ ఆత్మీయంగా ముచ్చటించారు. నిత్యం అందుతున్న ఆహార నాణ్యత, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, హాస్టల్ వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మెనూ ప్రకారం నిర్ణీత సమయానికి వేడివేడిగా, నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని వంటశాల, డైనింగ్ హాల్, తాగునీటి ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆహార తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన దినుసులు మాత్రమే ఉపయోగించాలని అన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటూ శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష, ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగామహెచ్‌పీవీ వ్యాక్సినేషన్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మన మీ వార్త ఆగస్టు18: వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గూగుల్ మీట్ ద్వారా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు (5,674) మంది లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు (2,466) మందికి టీకాలు అందించినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని సత్వరమే పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.
14 నుంచి 15 సంవత్సరాల వయసులోపు పిల్లలందరికీ హెచ్‌పీవీ టీకా అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మోడల్ స్కూళ్లు, కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న అర్హత కలిగిన పిల్లలకు టీకాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెచ్‌పీవీ టీకా ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రుల సమ్మతితో టీకాలు అందించాలని, ఎక్కడైనా అవసరం ఉంటే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వ్యాక్సినేషన్ లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ప్రతిరోజు వ్యాక్సినేషన్ పురోగతిని ఆన్‌లైన్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. లక్ష్య సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా విద్యా శాఖ అధికారుల సహకారంతో పాఠశాలల వారీగా అర్హులైన పిల్లలను గుర్తించి, వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా జిల్లాకు నిర్దేశించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ సురక్షితమైన, సమర్థవంతమైన టీకా అని, హెచ్‌పీవీతో సంబంధం ఉన్న వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల్లో అపోహలు లేకుండా టీకాపై సరైన అవగాహన కల్పించాలన్నారు.

**ఎన్‌సీడీ స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో అసంక్రమిత వ్యాధుల (చీజణ -- చీశీఅ-జశీఎఎబఅఅఝఎశ్రీవ ఱఅంఝంవం) నియంత్రణలో భాగంగా ప్రజలకు విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అసంక్రమిత వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు ప్రతి ఒక్కరికీ అవసరమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు. స్క్రీనింగ్‌లో వ్యాధులు గుర్తించిన వారికి తదుపరి వైద్య సేవలు అందించడంతో పాటు, అవసరమైన మందులను సకాలంలో సరఫరా చేయాలని తెలిపారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వాణి శ్రీ, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, ఇతర సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు, షట్లర్ గాయత్రి గోపీచంద్, షూటర్ ధనుష్ శ్రీకాంత్‌లకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



క్రీడారంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అర్జున అవార్డులకు ఎంపికైన గాయత్రి గోపీచంద్, ధనుష్ శ్రీకాంత్ తెలంగాణకు, దేశానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా, జాతీయ క్రీడా పురస్కారాలు--2025 అందుకున్న విజేతలందరికీ ముఖ్యమంత్రి గారు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడారంగంలో వారు కనబరిచిన అంకితభావం, పట్టుదల, కృషి యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవాలని ముఖ్యమంత్రి గారు ఆకాంక్షించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం సమాజానికి ఆదర్శం

- హుజురాబాద్ బీసీ జేఏసీ నాయకుల ఉద్బోధ

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి ఆగస్టు 18





హుజురాబాద్ పట్టణంలోని స్థానిక సైదాపూర్ రోడ్డు లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి ఉత్సవాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా మున్సిపల్ చైర్ పర్సన్ రెంటాల సుహాసిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఇట్టి సమావేశానికి అతిథిగాహాజరైన బీసీ జేఏసీ గౌరవాధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గం ముద్దుబిడ్డగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కిలా షాపూర్ లో జన్మించి గోల్కొండ కిలాపై జెండా ఎగురవేసి మొగలాయిలను ఎదిరించిన మొనగాడు సర్వాయి పాపన్న గౌడ్ గౌడ సామాజిక వర్గానికి చెందడం చాలా గర్వంగా ఉందన్నారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఉగ్గుపాలతోనే ఉద్యమ నేపథ్యాన్ని అలవర్చుకొని ఆనాటి మొగలులను ఎదిరించి భూస్వామ్య జమీందారీ జాగీర్దార్ల పెత్తందారితనాన్ని రూపుమాపడానికి ఒక గెరిల్లా సైనిక దళాన్ని ఏర్పాటు చేసి తన జీవితాన్ని ధారబోసి మొగుల్లుల కుట్రలో వీర మరణం పొందిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ సామాజిక వర్గంతో పాటు బీసీ సామాజిక వర్గ ప్రజల గుండెల్లో అజరామరంగా నిలుస్తాడన్నారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని ఒక ఆదర్శంగా తీసుకొని బలహీన వర్గాల బిడ్డలు ఐక్యమత్యంతో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు కదలాలని ఆకాంక్షించినారు ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షుడు సందేల వెంకన్న ప్రధాన కార్యదర్శి ఇప్ప కాయల సాగర్ బీసీ జాతీయ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గం మహిళా జనరల్ సెక్రెటరీ దేవ సాని ప్రియదర్శిని బీసీ జేఏసీ నాయకులు విలాసాగరపు వీరస్వామి చీకట్ల సమ్మయ్య మామునూరు ప్రవీణ్ కుమార్ కొలిపాక క్రాంతి కుమార్ చల్లూరి రఘు చారి పంజాల శ్రీధర్ దాసరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు

## అంబేద్కర్ నగర్ లో దుమ్మురేపిన పాపన్న గౌడ్ జయంతి వేడుకలు.





జవహర్ నగర్ ఆగస్టు 18: (వార్త ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్లో ఉన్న అంబేద్కర్ నగర్ లో వీరుడు. ధీరుడు.శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు ఘనంగా.. ఉత్సాహభరితంగా నిర్వహించారు. అంబేద్కర్ నగర్, బి జె ఆర్ నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గౌడ సంఘం సభ్యులు పెద్దలు యువకులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు వివిధ కులస్తులు భారీగా తరలివచ్చారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి.. నేటి తరానికి ఆదర్శం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీనవర్గాల కోసం పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన ధైర్యం, తెగువ. పోరాటపటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ ఆశయాలు చిరస్మరణీయం.. ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం అని అన్నారు. అంబేద్కర్ నగర్లో పండుగ వాతావరణం లో జరిగిన జయంతి వేడుకలు యువతలో ఉత్సాహాన్ని నింపాయి..

# అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలు ముద్రిస్తే చర్యలు తప్పవు

- ఫ్లెక్సీ తయారీదారులకు బల్దియా కమిషనర్ వెంకన్న హెచ్చరిక
- ఫ్లెక్సీలు ఏర్పాటుకు బల్దియా నుండి అనుమతుతి తప్పనిసరి
- ఫ్లెక్సీ తయారీదారులతో సమావేశం నిర్వహించిన కమిషనర్

మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో బల్దియా అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలను ముద్రించినా, అనధికారికంగా ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో నగర పరిధిలోని ఫ్లెక్సీ తయారీదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సుందరీకరణకు విఘాతం కలగకుండా ఫ్లెక్సీల ముద్రణ, ఏర్పాటు విషయంలో పాటించాల్సిన నిబంధనలపై వారికి కమిషనర్ పలు సూచనలు చేశారు.
కమిషనర్ మాట్లాడుతూ.. కమర్షియల్ సంస్థలకు సంబంధించిన ఫ్లెక్సీలను ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, మీడియన్లు, డివైడర్ల మధ్య ఉన్న టెలిఫోన్, విద్యుత్ స్తంభాలు, చెట్లపై ఏర్పాటు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని తెలిపారు. నిబంధనలకు సంబంధించిన సర్క్యులర్ కాపీలను ఫ్లెక్సీ తయారీదారులకు అందజేసి, వాటికి అనుగుణంగానే ఫ్లెక్సీలను ముద్రించాలని ఆదేశిస్తామన్నారు. కమర్షియల్ సంస్థల యాజమాన్యాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలనుకుంటే బల్దియా సూచించిన ప్రాంతాల్లో ముందస్తు అనుమతులు పొందిన అనంతరం మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగరంలోని ఫ్లెక్సీ తయారీదారులందరితో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు నిబంధనలు, ఆదేశాలను వారికి చేరవేస్తామని తెలిపారు. నగర సుందరీకరణను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. కమర్షియల్ సంస్థలు, ఫ్లెక్సీ యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే మునిసిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అనధికారిక ఫ్లెక్సీల నియంత్రణ, నగర సుందరీకరణకు సంబంధించి త్వరలో నగర పోలీస్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించి, పోలీస్ శాఖ సహకారం కోరనున్నట్లు కమిషనర్ తెలిపారు.
నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బల్దియాకు సహకరించాలని ఆయన కోరారు.
ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి శంకర్ లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర్ రావు, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# టీబీపై అప్రమత్తంగా ఉండాలి

- రెండు వారాలకు మించి దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దు
- రేమద్దులలో క్షయ వ్యాధి నిర్ధారణకు ఏసిఎఫ్ కార్యక్రమం
- అనుమానితుల నుంచి కఫం నమూనాల సేకరణ
- ఆరు నెలలు వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే టీబీ పూర్తిగా నయం

వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగష్టు 18 మీ వార్త



పానగల్ : క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు వ్యాధి అనుమానితులను ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పానగల్ మండలం రేమద్దుల గ్రామంలో వైద్యాధికారి ఆదేశాల మేరకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి లారెన్స్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధి నిర్ధారణ (ఏసిఎఫ్ ) అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్లు రామచందర్, శాంతమ్మ గ్రామంలో ప్రజలకు క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి, చికిత్సపై అవగాహన కల్పించారు. టీబీ అనుమానితుల నుంచి కఫం నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపించారు.రెండు వారాలకు మించి దగ్గు ఉంటే పరీక్ష చేయించుకోండి,రెండు వారాలకు పైగా దగ్గు ఉండటం, రెండు వారాలకు మించి జ్వరం కొనసాగడం, దగ్గినప్పుడు కఫంలో రక్తం కనిపించడం, తక్కువ సమయంలో బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రాత్రివేళల్లో అధికంగా చెమటలు పట్టడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని వైద్య సిబ్బంది సూచించారు. చాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మెడ భాగంలో వాపు, త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఎవరికి ఎక్కువ ప్రమాదం,ధూమపానం, మద్యం సేవించే వారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, హెచ్ఐవీతో జీవిస్తున్న వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, మధుమేహం ఉన్నవారు, పోషకాహార లోపంతో బాధపడేవారు, శారీరక ఎదుగుదల సరిగా లేనివారు, వలస కార్మికులు, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసించేవారు టీబీ బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్య సిబ్బంది వివరించారు.అన్ని అవయవాలకూ వ్యాపించే అవకాశం.టీబీ ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేసినప్పటికీ శరీరంలోని ఇతర అవయవాలకు కూడా వ్యాపించే అవకాశం ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. పేగులు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, వెన్నెముక, శోషరస గ్రంథులు తదితర అవయవాలకు కూడా టీబీ సోకవచ్చని వివరించారు.చికిత్స మధ్యలో ఆపొద్దు,వైద్యులు సూచించిన విధంగా మందులను క్రమం తప్పకుండా తీసుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. చికిత్సను మధ్యలో నిలిపివేస్తే వ్యాధి మళ్లీ తీవ్రతరం కావడంతోపాటు మందులకు స్పందించని టీబీ వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. వైద్యుల పర్యవేక్షణలో నిర్దేశించిన చికిత్సా కాలాన్ని పూర్తిచేస్తే టీబీని నయం చేయవచ్చని పేర్కొన్నారు.టీబీ రోగులకు పోషకాహార సహాయం,టీబీతో బాధపడుతున్న అర్హులైన వారికి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సహాయ పథకం గురించి కూడా అవగాహన కల్పించారు. చికిత్స పూర్తయ్యే వరకు పోషకాహారం తీసుకోవడం, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.
టీబీని దాచొద్దు.. గుర్తిస్తే చికిత్స తీసుకోండి,టీబీ లక్షణాలు కనిపించినప్పుడు భయపడకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు. వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా బాధితుడు కోలుకోవడంతోపాటు ఇతరులకు వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.టీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అనుమానిత లక్షణాలు ఉన్నవారు స్వయంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.
ఆశ కార్యకర్తల భాగస్వామ్యం. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు సంతోషమ్మ, గోవిందమ్మ, పారిజాతతోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజలకు టీబీ లక్షణాలు, జాగ్రత్తలు, పరీక్షలు, చికిత్సపై అవగాహన కల్పించారు. అనుమానితులను గుర్తించి పరీక్షలకు పంపే ప్రక్రియలో ఆరోగ్య సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు....

# సింగయ్యపల్లిలో వివాహిత అదృశ్యం

- కేసు నమోదు చేసిన జవహర్ నగర్ పోలీసులు

జవహర్ నగర్ ఆగస్టు 18: (వార్త ప్రతినిధి)



హకింపేట సింగయ్యపల్లి గ్రామానికి చెందిన షేక్ నజియా (30) అనే వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... నజియాకు కొన్నేళ్ల క్రితం సుభాని అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో సుభాని పిల్లలను తీసుకుని తన స్వగ్రామానికి వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 13న నజియా సింగయ్యపల్లిలోని తన తండ్రి ఖాజావల్లి ఇంటికి వచ్చింది. అనంతరం ఆగస్టు 14వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో "బయటకు వెళ్ళి వస్తాను" అని తండ్రికి చెప్పి వెళ్లిన నజియా తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలి తండ్రి జవహర్ నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. అదృశ్యమైన మహిళ గురించిన సమాచారం తెలిసిన వారు స్థానిక జవహర్ నగర్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

కాసిపేట, ఆగస్టు 18:(మన మీ వార్త మండల ప్రతినిధి)



బహుజన పోరాటయోధుడు సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను కాసిపేట మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.
కొండాపూర్ చౌరస్తాలో మండల మోకు దెబ్బ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మోకు దెబ్బ మండల సలహాదారు పల్లె మల్లయ్య మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ సుమారు 350 ఏళ్ల క్రితమే తెలంగాణలో బహుజన రాజ్య స్థాపన కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. బహుజన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజనులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం సలహాదారులు నేరెళ్ల బుగ్గగౌడ్, సంయుక్త కార్యదర్శి పడాల మల్లేష్‌గౌడ్, మండల యువజన కమిటీ అధ్యక్షుడు కోయాడ అంజన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి బుర్ర ప్రకాష్‌గౌడ్, యువజన నాయకులు నేరెళ్ల రవి, చరణ్‌గౌడ్, రజక సంఘం మండల నాయకుడు దావనపల్లి లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల నాయకుడు సుధాకర్‌రెడ్డి తదితరులతో పాటు కాసిపేట, ధర్మారావుపేట, మల్కపల్లి, కొండాపూర్ ప్రాంతాల గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ ఫ్యామిలీ మెంబర్? సర్టిఫికెట్?తో దర్జాగా ఇంటిరుణం.. తమ్ముడిపై అన్న ఫిర్యాదు..




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 18, (మన మీ వార్త న్యూస్):-

నకిలీ కుటుంబ ధ్రువీకరణ (ఫ్యామిలీ మెంబర్) పత్రాన్ని సృష్టించి, అన్నకు చెందిన ఇంటిపై రుణం తీసుకొని మోసానికి పాల్పడిన తమ్ముడిపై కేసు నమోదైంది. ఈ ఘటన నిజామాబాద్ నగరం లోని రెండో టౌన్? పీఎస్? పరిధిలో చోటు చేసుకుంది.

**ఫేక్ ఫ్యామిలీ సర్టిఫికెట్ శివాజీనగర్?లో..**

బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. నగరంలోని శివాజీనగర్‌లో 114.83 చదరపు గజాల ఇల్లు బాధితుడి తండ్రికి చెందింది. 2014 జూలై 7న ఆయన మరణించగా.. సదరు ఇంట్లో బాధితుడు తన కుటుంబంతో నివాసముంటున్నాడు. తమ్ముడు సంతోష్ 20 ఏళ్లుగా తన భార్యాపిల్లలతో కలిసి వేరుగా ఉంటున్నాడు. ఈ ఆస్తిపై సంతోష్‌కు ఎలాంటి హక్కులు లేవు.అయితే, సంతోష్ నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర పత్రాలను సృష్టించి, సదరు ఆస్తికి తానే యజమానిగా చలామణి అయ్యాడు. వీటి ఆధారంగా ఓ ప్రైవేట్? ఫైనాన్స్? కంపెనీలో రుణం పొందాడు. ఆపై 2023లో కూడా అదే ఆస్తిపై రుణం తీసుకున్నాడు. రుణం వాయిదాలు చెల్లించకపోవడంతో సంస్థ ప్రతినిధులు బాధితుడి ఇంటికి రావడంతో ఈ మోసం బయటపడింది. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గుంటి పోచమ్మ దేవాలయ స్థలానికే ఎసరు...!

- కబ్జా కోరుల నుంచి కాపాడాలని బీజేపీ ఎండోమెంట్ సెల్ ధర్నా
- ఎండోమెంట్ సెల్ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్ ఆధ్వర్యంలో

బోడుప్పల్ సర్కిల్, ఆగస్టు 18(మన మీ వార్త)

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని తిరుమల మెడోస్‌లో సర్వే నెం. 215లో ఉన్న గుంటి పోచమ్మ దేవాలయ స్థలం కబ్జాకు గురవుతున్న నేపథ్యంలో, దేవాలయ స్థలాన్ని కాపాడాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా ఎండోమెంట్ సెల్ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్ ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివిజన్ అధ్యక్షుడు తలారి రవి యాదవ్, సీనియర్ నాయకులు వేమునూరి మురళీధర్, దాసరి మహేష్, గొల్లపూడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ భానుకుంట వేణుగోపాల్, కంటెస్టెడ్ కార్పొరేటర్లు ఎస్.ఎం. ప్రగతి, ఆదిమూలం రమాదేవి, లీలావతి, జిల్లా కో-కన్వీనర్ ఎన్. అశోక్, ఎం. మాధవి, పి . వెంకటేశ్వర్లు, డివిజన్ కన్వీనర్లు సంజీవ, కె. కృష్ణ, పి. అశోక్, డివిజన్ కో-కన్వీనర్లు మాయకోటి వీరస్వామి, ఎం. నరసింహ, బి. మల్లేష్,ఎస్ రవి కుమార్, బీజేవైఎం నాయకులు చందు, పి. వంశీ మరియు అలాగే కాలనీవాసులు వెంకటస్వామి, కృష్ణమూర్తి, భాస్కర్, శ్రీనివాస్, కృష్ణయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని



దేవాలయ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 మీ వార్త

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా వనపర్తి నంది హిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ... సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన గొప్ప ప్రజా యోధుడని కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి, ఆనాటి అణచివేత, దోపిడీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని అన్నారు. సామాన్య ప్రజలను ఏకం చేసి వారికి అండగా నిలిచిన పాపన్న గౌడ్, బలహీన వర్గాలకు ఆత్మవిశ్వాసం



కల్పించారని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం పోరాడిన ఆయన స్ఫూర్తి నేటి తరానికి కూడా ఆదర్శమని తెలిపారు. తెలంగాణ గడ్డపై ప్రజల కోసం పోరాడిన వీరుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే



తూడి మేఘారెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# సమగ్ర చీడపీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన

కాసిపేట, ఆగస్టు 18:(మన మీ వార్త మండల ప్రతినిధి)

ప్రధాన పంటల్లో సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కాసిపేట మండలం ముత్యంపల్లి రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పత్తి పంటలో చీడపీడలను ప్రారంభ దశ నుంచే గుర్తించేందుకు క్రమం తప్పకుండా పంటను పరిశీలించాలని సూచించారు. పురుగుల ఉధృతి ఆర్థిక నష్టం స్థాయి (ఈటీఎల్) దాటినప్పుడు మాత్రమే సిఫారసు చేసిన నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. పచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, గులాబీరంగు పురుగు పర్యవేక్షణకు లింగకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధిక నత్రజని ఎరువుల వినియోగాన్ని నివారించి సమతుల్య పోషక యాజమాన్యం పాటించాలన్నారు. అవసరమైన చోట పక్షి కూర్చునే కొమ్మలు, అంటుకునే ఉచ్చులు తదితర



పరికరాలను వినియోగించాలని తెలిపారు.
వరి పంటలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు వంటి వాటిని తొలిదశలోనే గుర్తించేందుకు పంటను పరిశీలించాలని సూచించారు. అధిక నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల యాజమాన్యం పాటించాలని, అవసరమైన చోట వెలుగు ఉచ్చులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పొలాల్లో సాలీడులు, పరాన్నజీవి కీటకాలు వంటి మిత్ర కీటకాలను సంరక్షించాలని సూచించారు.
పురుగుమందులను విచక్షణారహితంగా వినియోగించడం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు మిత్ర కీటకాలు నశించడం, పురుగుల్లో మందుల నిరోధకత పెరగడం, పర్యావరణ కాలుష్యం వంటి సమస్యలు తలెత్తుతాయని అధికారులు తెలిపారు. లేబుల్‌పై సూచించిన మోతాదులో, సరైన నీటి పరిమాణంతో మందులను పిచికారీ చేయాలని, పిచికారీ సమయంలో వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగించాలని సూచించారు.
సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు.
ఈ కార్యక్రమంలో కాసిపేట మండల వ్యవసాయ అధికారి సీహెచ్. ప్రభాకర్, బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్. ప్రేమ్‌కుమార్, ఆత్మ డైరెక్టర్ మేడి సమ్మయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్, రైతులు పాల్గొన్నారు.

# స్కేటింగ్ లో జాతీయ స్థాయి రికార్డ్ సాధించిన 32 మంది చిన్నారులను అభినందించిన జిల్లా ఎస్పీ

- 80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్‌తో వనపర్తి విద్యార్థుల అరుదైన రికార్డ్
- స్కేటింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్న చిన్నారులు
- క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలకు ప్రతీకగా నిలిచిన 32 మంది విద్యార్థులు
- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్

వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 మీ వార్త

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బౌరంపేట్‌లో మిషన్ స్కేటింగ్ అకాడమీ పూణే వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక 80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్ ఈవెంట్‌లో వనపర్తి జిల్లాకు చెందిన 32 మంది విద్యార్థులు పాల్గొని అరుదైన జాతీయ స్థాయి రికార్డ్ సాధించారు. ఎటువంటి విరామం లేకుండా 80 నిమిషాల పాటు నిరంతరంగా స్కేటింగ్ చేస్తూ విద్యార్థులు తమ అద్భుత ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణను చాటుకున్నారు. ఈ ఘనతకు గుర్తింపుగా విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాతీయ రికార్డు సాధించిన విద్యార్థులు, కోచ్ రాథోడ్ కిషన్, నిర్వాహకులు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో స్కేటింగ్ ద్వారా చేసిన అద్భుత విన్యాసాలను ప్రదర్శించగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ ఆసక్తిగా తిలకించి చిన్నారుల ప్రతిభకు ముగ్ధులయ్యారు. 80 నిమిషాల పాటు నిరంతరంగా స్కేటింగ్ చేసి రికార్డ్ సాధించడమే కాకుండా, స్కేటింగ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన వేగం, సమన్వయం, సమతుల్యత, క్రమశిక్షణను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... చిన్న వయసులోనే మంచి ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయి రికార్డు సాధించడం వనపర్తి జిల్లాకు గర్వకారణం. మీలో కనిపిస్తున్న క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల ఎంతో అభినందనీయం" అని ప్రశంసించారు. క్రీడలు కేవలం గెలుపు కోసం మాత్రమే కాదు. క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించే గొప్ప సాధనం. 80 నిమిషాల పాటు నిరంతరంగా స్కేటింగ్ చేసి జాతీయ స్థాయి రికార్డ్ సాధించడం సాధారణ విషయం కాదు. ఇది మీ కృషి, మీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకత్వానికి నిదర్శనం. ఈ విజయంతో సంతృప్తి చెందకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి వనపర్తి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ విద్యార్థులను ప్రోత్సహించారు.
వనపర్తి జిల్లా నుంచి ఒకేసారి 32 మంది విద్యార్థులు జాతీయ స్థాయి రికార్డ్ సాధించడం జిల్లా క్రీడా చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిలిచిందని కోచ్ రాథోడ్ కిషన్ తెలిపారు. ఈ విజయం విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపడంతో పాటు ఇతర చిన్నారులకు కూడా క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్ రాథోడ్ కిషన్, నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు ఇదే క్రీడాస్ఫూర్తి, పట్టుదల, క్రమశిక్షణతో





ముందుకు సాగి భవిష్యత్‌లో మరిన్ని ప్రపంచస్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వనపర్తి చిన్నారుల స్కేటింగ్ ప్రతిభకు జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా ఎస్పీ స్వయంగా ప్రశంసలు అందించడం విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీ, బాలాజీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై, మంజునాథ్ రెడ్డి, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి, ఎస్సై జగన్ మోహన్, స్కేటింగ్ కోచ్, కిషన్ స్కేటింగ్ చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు....

## మండల ప్రజావాణికి విశేష స్పందన

- 24 గంటల్లోనే విద్యుత్ సమస్యను పరిష్కరించిన విద్యుత్ శాఖ ఏఈ మంగమ్మ

ఖానాపురం ఆగష్టు18(వార్త ప్రతినిధి మల్లేష్ ) :

మండల ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎంపీడీవో వనపర్తి అద్వైత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అధికారులకు వినతులు సమర్పించారు.



ఈ సందర్భంగా మండల విద్యా వనరుల కేంద్రం పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చాలని మండల విద్యాశాఖ అధికారులు వినతిని సమర్పించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ మంగమ్మ వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, 24 గంటల్లోపే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు, అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు తక్షణ స్పందనతో చర్యలు తీసుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

## జిల్లా మార్కెటింగ్ అధికారిగా నాగరాజు బాధ్యతల స్వీకరణ

మన మీ వార్త ఆగస్టు18: వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ జిల్లా డీఎంఓగా కే. నాగరాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



## వరంగల్ గ్రేటర్ మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యలపై ఈ నెల 25న 'మహా ధర్నా' -- అనుమతి కోసం సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత కి వినతిపత్రం.





మన మీ వార్త ఆగస్టు18:వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన భారీ ఎత్తున 'మహా ధర్నా' కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, కొలను సంతోష్ రెడ్డి తెలిపారు.
ఈ మహా ధర్నా కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించుకునేందుకు చట్టపరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ, ఈరోజు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత గారిని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారితో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జలగం రంజిత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శి పోనుగోటి వెంకట్ రావు గార్లు పాల్గొన్నారు.

## మనోహరాబాద్ మండల వ్యాప్తంగా ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

ఆగస్టు 18 మన మీ వార్త ప్రతినిధి

బహుజనుల ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న 367 జయంతి వేడుకలు మనోహరాబాద్ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు మండలంలోనిగౌడ కులస్తులు ఆయన చిత్రపటానికి





పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న నినాదాన్ని నమ్మిన వ్యక్తి ఆయన బహుజనుల గుండెల్లో చిరస్మరణీయుడైన ప్రభుత్వాలు ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యపుస్తకాలలో పొందుపరచాలని యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవించాలని గ్రామ గ్రామాన ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512